
ఆహ్వాన సుమాంజలి
విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు
అన్న NTR పిలుపుతో
తెలుగుదేశం పార్టీలో రాజకీయ
అరంగేట్రం చేసి, 42 సం॥లు
సుదీర్ఘ కాలం పార్టీలో విశిష్ట సేవలు అందిస్తున్న
మహోన్నత వ్యక్తి, అపర చాణుక్యుడు, మేథా సంపన్నులు
శ్రీ యనమల రామకృష్ణుడు గారికి
"42 వసంతాలు రాజకీయ ప్రస్థానం"
వేడుక నిర్వహించబడుచున్న సందర్భంగా అందరూ
విచ్చేయవలసిందిగా కోరి ప్రార్థిస్తున్నాము.
యనమల
42 వసంతాల
రాజకీయ ప్రస్థానం
42 వసంతాలు రాజకీయ ప్రస్థానం "పుస్తకావిష్కరణ"
గౌరవనీయులు శాసనసభ స్పీకర్
శ్రీ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారి
సువర్ణ హస్తాల మీదుగా జరుపబడును.
వేదిక:
సాయి వేదిక
ఫంక్షన్ హాలు,
తుని
తేదీ, సమయం
ది.10-04-2025
గురువారం
సా॥ 4 గం॥లకు
గౌ॥ శ్రీ యనమల రామకృష్ణుడు గారు
MA., LLB
రాష్ట్ర టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు
గౌ॥ శ్రీమతి యనమల దివ్య గారు
రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు
ఎమ్మెల్యే, తుని నియోజకవర్గం
తెలుగుదేశం పార్టీ - తుని నియోజకవర్గం

కాకినాడ సాగరతీరంలో...

టైగర్ ట్రంప్ విన్యాసాలు ప్రారంభం


విన్యాసాల్లో పాల్గొన్న ఇండో-అమెరికన్ సైనికులు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇండియా-అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రంప్ విన్యాసాలు మంగళవారం కాకినాడ సాగరతీరంలో లాంఛనంగా ప్రారంభమయ్యాయి. సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో భారత తూర్పు నావికాదళం, అమెరికా (యూఎస్) యాంపీబియాస్ విన్యాసాల్లో భాగంగా నేవెల్ ఎన్‌క్లేవ్‌లో ఇరుదేశాలు సంయుక్తంగా సైనిక విన్యాసాలు నిర్వహించేందుకు బలగాలు చేరుకున్నాయి. యుద్ధ సమయంలో శత్రుదేశాలపై ఆకాశ, భూమార్గం, సముద్రమార్గంలో త్రివిధ దళాలు జరి పే దాడులు, ఆయుధాల పనితీరు, యుద్ధ ట్యాంకులు, యుద్ధనౌకలు, సైనిక హెలికాప్టర్లు, జెట్ విమానాలతో ఇరుదేశాల త్రివిధ దళాలు ఇప్పటికే సూర్యారావుపేట బీచ్‌కు చేరుకున్నాయి. అమెరికాకు చెంది న 2 యుద్ధ నౌకలు, భారత్‌కు చెందిన యుద్ధ నౌక లు ఇప్పటికే కాకినాడ సముద్ర ప్రాదేశిక డీప్ సీలో ఉన్నాయి. హోవర్ క్రాఫ్టులు, సహాయ కార్యక్రమాలకు వినియోగించే పలు వాహనాలు, యుద్ధ ట్యాంకర్లు, యుద్ధ నౌకలు డీప్ సీలు ఉన్నాయి. ఆర్మీ సిబ్బంది సముద్ర తీరంలో ప్రత్యేక రక్షణ గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. టైగర్ ట్రంప్ యాం పీబియాస్ విన్యాసాలు మంగళవారం నుంచి ఈనెల 13 వరకు జరుగుతాయని త్రివిధ దళాల అధికారులు తెలిపారు. ఇరుదేశాల త్రివిధ దళాల సేనలు బుధవారం నుంచి సముద్రం, ఆకాశంలో విన్యాసాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. విన్యాసాలు జరిగేప్రాంతంలో కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత బందోబస్తును పర్యవేక్షించారు.

బీచ్ రోడ్డులో రాకపోకల నిషేధం

కాకినాడ సాగరతీరంలో సైనిక విన్యాసాల నిర్వహణ కోసం వాకలపూడి లైట్‌హౌస్ నుంచి ఉప్పాడ వరకు బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలను నిషేధించినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. తిమ్మాపురం పోలీస్ స్టేషన్, యు.కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో బీచ్‌రోడ్డును నిషేధిత ప్రాంతంగా ప్రకటిచారు. బీచ్‌రోడ్డు మీదుగా వెళ్లే వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలని, ఆంక్షలు ఈనెల 13 వరకు కొనసాగుతాయన్నారు.

విశ్వావసునామ సంవత్సరంలో..

నేటి నుంచి వివాహాది శుభ కార్యక్రమాల సందడి

అమలాపురం రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరంలో సీతారాముల కల్యాణం పూర్తయిన తర్వాత వరుసగా వివాహాది శుభ కార్యక్రమాలకు చాలా ముహూర్తాలు ఉన్నాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్‌లోని బండారులంకకు చెందిన ఈశ్వర గంటల పంచాంగకర్త కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి తెలిపారు. జూన్ నెలలో గురుమౌఢ్యమితోపాటు జూలై 24 వరకు ఆషాడమాసం కావడంతో ముహూర్తాలు ఉండవన్నారు. శ్రావణ మాసంలో తిరిగి శుభముహూర్తాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈనెల 9 నుంచి వివాహాది శుభ ముహూర్తాలు వరుసగా ఉన్నాయని చెప్పారు. ఈనెల 27 వరకు చైత్ర మాసం. ఈ మాసంలో శంకుస్థాపనలకు శ్రేష్ఠం కాదు. కానీ ఈ నెలలో 9, 11, 15, 18, 22, 23, 24 తేదీల్లో వివాహ ముహూర్తాలు ఉన్నాయి. ఇక గృహ ప్రవేశాలు ఈనెల 11, 12, 13, 15, 16, 20, 21, 22, 23, 24 తేదీల్లోను, అక్షరాభ్యాసానికి 9, 11, 13, 16, 18, 21, 23, 24 తేదీలు అనుకూలం. ఇక ఈనెల 28 నుంచి మే 27వ తేదీ వరకు వైశాఖ మాసం. ఈ మాసంలో వివాహ ముహూర్తాలు చూస్తే ఏప్రిల్ 29, 30 తేదీలతోపాటు మే1, 7, 8, 9, 11, 14, 15, 16, 17, 21, 22 తేదీలు అనుకూలం. శంకుస్థాపనలకు ఈనెల 29, 30, మే 1, 3, 4, 8, 9 తేదీలు అనుకూలం. మే 11 నుంచి 28 వరకు వాస్తు కర్తరి కావడంతో శంకుస్థాపనలకు, గృహప్రవేశాలకు ముహూర్తాలు ఉండవు. అయితే గృహప్రవేశాలకు ఈనెల 29, 30 తేదీలు, మే 1, 3, 4, 7, 8, 10 తేదీలు మాత్రమే అనుకూలం. అక్షరాభ్యాసానికి ఈనెల 30, మే 1, 3, 4, 8, 9, 11, 14, 16, 21 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి.


జ్యేష్ఠ మాసంలో అంతంతమాత్రంగానే : భీమేశ్వరరావు సిద్ధాంతి

మే 28 నుంచి జూన్ 25వ తేదీ వరకు జ్యేష్ఠ మాసం. ఈ మాసం శంకుస్థాపనలకు శ్రేష్ఠం కాదు. ఇక వివాహ ముహూర్తాలు జూన్ 5, 7, 8 తేదీలు, గృహప్రవేశాలు మే 30, 31, జూన్ 6 తేదీలు. అక్షరాభ్యాసానికి మే 31, జూన్ 2, 5, 6, 7, 8 తేదీలు అనుకూలం. జూన్ 10 నుంచి జూలై 9వ తేదీ వరకు గురుమౌఢ్యమి. జూన్ 26 నుంచి జూలై 24వ తేదీ వరకు ఆషాఢమాసం కావడంతో వివాహాది శుభ ముహూర్తాలు ఉండవు. జూలై 26 నుంచి శ్రావణమాసంలో తిరిగి శుభ ముహూర్తాలు ఉన్నాయి.

భక్తజన వాడపల్లి

అంగరంగ వైభవంగా దేవదేవుడి కల్యాణం

కోనసీమ తిరుమల కళకళలాడింది.. దేవదేవుడు తిరువీధుల్లో తిరుగాడాడు.. భక్తజనానికి కనుల విందు చేశాడు.. స్వామిని వేడుకునేందుకు వేలాదిగా భక్తజనం పోటెత్తారు.. స్వామిని కనులారా చూసేందుకు పోటీపడ్డారు.. గోవిందా..గోవింద అంటూ గొంతెత్తి స్వామిని పిలిచారు.. కొలిచారు.. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామిని భక్తజనం దర్శించుకుని తరించారు.. వాడపల్లి వెంకన్న తీర్థ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి స్వామి రథోత్సవం, దివ్యకల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ క్రతువును భక్తజనం కనులారా వీక్షించి పులకించిపోయారు.


రథోత్సవం..


కల్యాణ మహోత్సవంలో తలంబ్రాల దృశ్యం

- బ్రహ్మాండంగా కోనేటి రాయుని రథోత్సవం
- తిరువీధుల్లో మెరిసిన దేవదేవుడు
- ప్రారంభించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు
- పులకించిన భక్తజనం

ఆత్రేయపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం స్వామివారి తీర్థం, రథోత్సవం, కల్యాణోత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని కల్యాణోత్సవాలను తిలకించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో ప్రధాన హోమాలు, నిత్యబలిహరణతో కార్యక్రమాలను ప్రారంభించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్‌తోపాటు అధికార యంత్రాంగం, కూటమి శ్రేణులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవమూర్తులను ఆలయం ఎదురుగా ఉన్న ఎదుర్కోలు మండపం వద్దకు తొడ్కుని వెళ్లి వేదపడింతులు, అర్చకులు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారు తిరువీధులలో విహరించారు.

రథోత్సవానికి తరలివచ్చిన భక్తజనం...

స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం మూడు గంటలకు రథంపై స్నపనమూర్తులు వేదమంత్రాల సాక్షిగా అలంకృతలయ్యారు. ఎమ్మెల్యే బండారు రథోత్సవాన్ని ప్రారంభించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తజన గోవిందనామస్మరణతో స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. తిరువీధుల్లో డ్రోన్లతో రథోత్సవంపై పూలవర్షం కురిపించారు. స్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్, ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావుతోపాటు అధికార యంత్రాంగం కల్యాణోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. 200 మంది పోలీస్ సిబ్బంది ఏర్పాట్లలో వివిధ ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహించారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు, బిస్కెట్లు, అన్నదానం వంటి కార్యక్రమాలు దేవస్థానం, వివిధ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటుచేశారు.


కల్యాణ వేదిక వద్దకు స్వామివార్లు


రథోత్సవంలో భక్తజనం

కల్యాణం.. కమనీయం

వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి స్వామి అమ్మవార్లను మంగళవాయిద్యాలతో శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. సుగంధ పరిమళాలు వెదజల్లే వివిధ రకాల ఫలపుష్పాలతో అలకరించిన కల్యాణ వద్ద స్వామి అమ్మవార్లు ఆశీనులయ్యారు. వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం ఖండవిల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు స్వామివారి దివ్యకల్యాణ క్రతువును నిర్వహించారు. సుముహూర్త వేళ కన్యాదానం, మాంగళ్యధారణ, తలంబ్రాల తంతును వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తజన గోవిందనామస్మరణ నడుమ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు, జేసీ నిషాంతి, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు-కనకదుర్గాదేవి దంపతులు, ఆర్డీవో శ్రీకర్ దంపతులు, డీఎస్పీ సుంకర మురళీమోహన్ దంపతులు, దేవదాయ డిప్యూటీ కమిషనరు డీఎల్వీ రమేష్‌బాబు, జిల్లా దేవదాయ శాఖ అధికారి సత్యనారాయణ స్వామివారికి సమర్పించారు. స్వామివారి కల్యాణ తంతు జరుగుతుండగా వందల కిలోల హారతికర్పూరంతో జ్యోతిని వెలిగించారు. మిరిమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు, విద్యుత్ వెలుగుల నడుమ నిర్వహించిన స్వామివారి కల్యాణాన్ని వేలాదిమంది భక్తులు తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణ రెడ్డి, జడ్పీటీసీ బోణం సాయి బాబా, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, కూటమి నేతలు, భక్తులు పాల్గొన్నారు.


వేడుకలో అతిథులు

దొంకరాయి నుంచి గోదావరి డెల్టాకు..

నీటి విడుదల నిలిపివేత

సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ జీఎం వాసుదేవరావు

సీలేరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డొంకరాయి జలాశయం స్పిల్‌వే గేట్ల నుంచి గోదావరి డెల్టా రబీ పంటలకు నీటి విడుదలను మంగళవారం నుంచి నిలిపివేసినట్టు సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ జీఎం వాసుదేవరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గోదావరి డెల్టా రబీ పంటలకు ధవళేశ్వరం వద్ద నీటి మట్టాలు తగ్గుముఖం పట్టడంతోపాటు పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే 4,300 క్యూసెక్కులు సరిపోకపోవడంతో డొంకరాయి నుంచి అదనపు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు జెన్‌కో ఉన్నతాధికారు లు కోరారన్నారు. ఈ నేపథ్యంలో డొంకరాయి నుంచి ఫిబ్రవరి 10 నుంచి నీటిని 3వేల క్యూసెక్కుల చొప్పున, మార్చి ఒకటి నుంచి 4వేల క్యూసెక్కుల చొప్పున, మార్చి 21 నుంచి 5వేల క్యూసెక్కుల చొప్పున విద్యుత్ ఉత్పత్తి లేకుండా నేరుగా గోదావరి డెల్టాకు విడుదల చేసినట్టు సీఈ తెలిపారు. ఫిబ్రవరి 10 నుంచి ఏప్రిల్ 7 రాత్రి వరకు 15 టీఎంసీఈల నీటిని అందించినట్టు తెలిపారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలోని ఆంధ్రా వాటా నీటితో కలిసి డొంకరాయి, గుంటవాడ జలాశయాల్లో మొత్తంగా 48 నుంచి 50 టీఎంసీల వరకు నీటి నిల్వలు ఉన్నాయన్నారు. మండు వేసవిలో సీలేరు కాంప్లెక్సులోని సీలేరు, డొంక రాయి, పొల్లూరు, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాల్లో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపడుతున్నట్టు వాసుదేవరావు పేర్కొన్నారు.

బీజేపీలో గ్రూపులు, పైరవీలకు చోటులేదు

- అలాంటి వారిని అధిష్ఠానం ఉపేక్షించదు
- ఎమ్మెల్సీ సోము అభినందన సభలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ


సోమును అభినందిస్తున్న కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో గ్రూపులు, పైరవీలకు చోటు ఉండదని కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. అలాంటి వారిని పార్టీ అధిష్ఠానం ఉపేక్షించదనే విషయాన్ని నాయకులు, కార్యకర్తలు గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో బీజేపీ ఎమ్మెల్సీగా రెండో సారి ఎన్నికైన సోము వీర్రాజుకు అభినందన సత్కారసభ నిర్వహించారు. ఈ సభకు శ్రీనివాసవర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సోము వీర్రాజు లేకపోతే తాను లేనన్నారు. కమ్యూనిస్టు పార్టీకి చెందిన ఏఐఎస్ఎఫ్‌లో ఉన్న తనను బీజేపీలోకి తీసుకొచ్చింది వీర్రాజేనని, పార్టీలో 30 ఏళ్లుగా కష్టపడి పనిచేయబట్టే ఈ రోజు కేంద్ర మంత్రి పదవి దక్కిందన్నారు. పార్టీ కోసం మనం పడిన కష్టమే గుర్తింపు, పదవులు తెచ్చిపెడుతుందని, సోము వీర్రాజుకు రెండోసారి ఎమ్మెల్సీ పదవి దక్కడం అందుకు ఉదాహరణ అన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వీర్రాజు 40 ఏళ్ల కిత్రం ఏ పార్టీలో చేరారో అదే రాజకీయపార్టీలో కొనసాగడం ఆయన అంకితభావాన్ని తెలియజేస్తుందన్నారు. శ్రీనివాస వర్మ, దుర్గేష్‌లు వీర్రాజుకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

త్వరలో తమిళనాడు, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం : సోము

తమిళనాడులో త్వరలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని, తర్వాత తెలంగాణాలోనూ తమ ప్రభుత్వం ఏర్పడుతుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు జోస్యం పలికారు. ఎప్పుడు ఏం చేయాలో బీజేపీకి ఒక వ్యూహం ఉంటుందన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నపుడు ప్రతి నెలా వేల కోట్లు అప్పులు ఇప్పించేవాళ్లం. అంతే చేశాం. పోలవరానికి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నిధులు, రైల్వేజోన్ వంటివి ఇవ్వలేదన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు సీఎం అయ్యాక డబుల్ ఇంజన్ సర్కార్ రావడంతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. రాష్ట్రంలోని రొయ్యల రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, కేంద్ర మంతి శ్రీనివాసవర్మ కృషి చేస్తారన్నారు. జిల్లా మాజీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు పర్యవేక్షణలో జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ అభినందన సభలో బీజేపీ ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఈశ్వరరావు, బీవీఎన్ మాధవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, వేటుకూరి సూర్యనారాయణరాజు, బీజేపీ యువమోర్చా నాయకుడు నాగిరెడ్డి దుర్గామహేష్, పాకా సత్యనారాయణ, కంబాల శ్రీనివాసరావు, భద్రం మాట్లాడారు. రాష్ట్ర నాయకులు నిర్మల, ముళ్లపూడి రేణుక, రేలంగి శ్రీదేవి, అయినంపూడి శ్రీదేవి పాల్గొన్నారు. కాపు సంఘం నాయకులు, జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు సోము వీర్రాజును ఘనంగా సత్కరించారు. అంతకుముందు కోటిపల్లి బస్టాండు సెంటర్ నుంచి సభా వేదిక వరకూ నిర్వహించిన భారీ ర్యాలీలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సోము వీర్రాజు


మంత్రి కందుల దుర్గేష్

సచివాలయ ఉద్యోగిని అనుమానాస్పద మృతి

మృతురాలి బంధువులను పరామర్శించిన మంత్రి దుర్గేష్


మృతిచెందిన నెల్లి కరుణ

నిడదవోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగిని అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామానికి చెందిన నెల్లి కరుణ(25) నిడదవోలు 9వ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుంది. రోజులాగే సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వచ్చి చర్చికి వెళ్లినట్టు తల్లి నెల్లి సూర్యకుమారి తెలిపింది. చర్చి నుంచి వచ్చిన తరువాత కడుపునొప్పి వచ్చి అస్వస్థతకు గురైందని, నిడదవోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో అక్కడ నుంచి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా మృతిచెందినట్టు ధ్రువీకరించారని చెప్పింది. దీనిపై సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చేయగా ఎస్ఐ వీరబాబు మృతదేహాన్ని పరిశీలించి మంగళవారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ మృతురాలి కుటుంబీకులను మంత్రి దుర్గేష్ పరామర్శించారు. కరుణ మృతిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు.

తల్లిని చూసేందుకు వెళ్తుండగా...

ఇసుక లారీ ఢీకొని వ్యక్తి మృతి


మృతిచెందిన గోవిందు

ఆత్రేయపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తల్లిని చూసేందుకు వెళ్తున్న వ్యక్తిని ఇసుక లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామానికి చెందిన కడలి గోవిందు (44) వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నాడు. మంగ ళవారం తన తల్లిని చూడడానికి మట్లదొడ్డి గ్రామానికి వెళ్తుండగా డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం మెర్లపాలెం మావుళ్లగుడి సమీపంలో రావులపాలెం నుంచి ఆత్రేయపురం వస్తున్న ఇసుక లారీ ఎదురుగా మోటార్‌సైకిల్‌పై గోవిందును బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ రాము కేసు నమోదు చేశారు.

సభకు విచ్చేయండి

యనమల 42 వసంతాల రాజకీయ ప్రస్థానంపై రేపు పుస్తకావిష్కరణ

కార్యక్రమానికి రావాల్సిందిగా అతిథులకు టీడీపీ నేతల ఆహ్వానాలు

తుని రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యనమల 42 వసంతాల రాజకీయ ప్రస్థానం పుస్తకావిష్కరణ సభకు రావాల్సిందిగా అతిథులకు తుని నియోజకవర్గ టీడీపీ, జనసేన నాయకులు ఆహ్వానం పలికారు. యనమల రామకృష్ణుడు రాజకీయ జీవితంపై ప్రచురించిన ఈ పుస్తకాన్ని ఈనెల 10న కాకినాడ జిల్లా తునిలో అవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి అనిత విచ్చేయనున్నారు. ఈ సభకు హాజరుకావాల్సిందిగా అతిథులను టీడీపీ నేత యనమల రాజేష్ స్వయంగా ఆహ్వానపత్రాలు అందజేసి ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే కొందరికి వీటిని అందజేశారు. మంగళవారం ఆయన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు నవీన్, సీనియర్ నేత పిల్లి సత్యనారాయణమూర్తి ఆహ్వానపత్రాలు అందజేశారు. సభ విజయవంతానికి టీడీపీ, జనసేన శ్రేణులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

గోదావరి జలాల కాలుష్యంపై

డెల్టాయిక్ ప్రాంతీయ కేంద్రం అధ్యయనం

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

సామర్లకోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గోదావరి కాలువ జలాల కాలుష్యంపై అధ్యయనం చేసేందుకు కేంద్రీయ హైడ్రాలజీ ఇనిస్టిట్యూట్ డెల్టాయిక్ ప్రాంతీయ కేంద్రం అంగీకరించింది. 'ఆ మూడింటికీ నీటి ఎద్దడి తప్పదా' పేరిట ఆంధ్ర జ్యోతిలో ఈ నెల 6న కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీంతో జిల్లా ఉన్నతాధి కారులు స్పందించి తక్షణం మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డెల్టాయిక్ ప్రాంతీయ కేంద్రం శాస్త్రవేత్త ఎస్వీ విజయకుమార్ ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు మంగళవారం లేఖ పంపారు. శాస్త్రీయ పరిశోధనలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందించడం ద్వారా కాలుష్య మూల కాలు, కలుషితాలను గుర్తించేందుకు తూర్పు డెల్టా కాలువలో పూర్తిస్థాయిలో అధ్యయనం చేసేందుకు తగిన రీతిలో నివేదికలు రూపొం దించేందుకు కాలుష్య నియంత్రణ మండలి, ఇరిగేషన్, వ్యవసాయ, పురపాలక, ఏపీ రాష్ట్ర లీడ్ కార్పొరేషన్ వంటి శాఖల అధికారుల సమన్వయం ఎంతో అవసరమని హైడ్రాలజిస్ట్ విజయకుమార్ కమిషనర్‌కు రాసిన ఆ లేఖలో తెలిపారు.

ఐవీఆర్ఎస్ సర్వేలో

అన్నవరం దేవస్థానానికి రెండో స్థానం

అన్నవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): భక్తుల సౌకర్యాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం రెండో స్థానాన్ని పదిలం చేసుకుంది. మొదటి నెల సర్వేలో చివరిస్థానంలో ఉండడంతో కాకినాడ జిల్లా కలెక్టర్ అన్నవరం ఆలయంపై ప్రత్యేక దృష్టిసారించి ఈవో వీర్ల సుబ్బారావుకు సూచనలు చేయడం వాటిని ఆయన అమలుపరుస్తూ రెండో నెల సర్వేలో రెండో స్థానానికి చేరుకుంది. మూడో నెల సర్వే వివరాలు మంగళవారం వెల్లడించారు. వీటిలో శ్రీకాళహస్తి దేవస్థానం మొదటిస్థానంలో ఉండగా చివరి స్థానంలో సింహాచలం చేరింది. ఇదిలాఉండగా భక్తుల తమ అభిప్రాయాల సేకరణకు చేపట్టిన క్యూఆర్ కోడ్ స్కానర్‌కు సంబంధించి అన్నవరం దేవస్థానానికి విచ్చేసిన భక్తులు ఎక్కువగా స్కాన్ చేయడం విశేషం. మొత్తం 6682 మంది భక్తులు ఈ నెలలో స్కాన్‌చేయగా ఐవీఆర్ఎస్ కాల్స్‌లో 3284 మంది స్పందించి వివరాలు తెలియజేశారు. దర్శనం సంతృప్తిగా జరిగినట్టు 93శాతం తెలుపగా, మౌలిక వసతులు బాగున్నట్టు 86శాతం మంది అభిప్రాయం తెలిపారు. 94శాతం మంది అన్నవరం ప్రసాదం రుచిగా ఉందన్నారు. దేవాలయంలో పారిశుధ్య నిర్వహణ బాగుందని 93శాతం మంది ఐవీఆర్ఎస్ సర్వేలో తెలియజేశారు. తదుపరి సర్వేలో మొదటిస్థానం చేరుకునేందుకు చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు. సిబ్బందిని సమన్వయం చేయడంతో ఇది సాధ్యమవుతుందని పేర్కొన్నారు.


పండిత సదస్యం నిర్వహిస్తున్న దృశ్యం

రామాలయంలో పండిత సదస్యం

సీతారాముల దివ్యకల్యాణోత్సవాల్లో భాగంగా అన్నవరం దేవస్థానం క్షేత్రపాలకులైన రామాలయంలో మంగళవారం సాయంత్రం 4గంటలకు నవదంపతులైన సీతారాములను, పెండ్లిపెద్దలైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను ఆశీనులుగావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన పండితులు తమ పాండిత్యాన్ని నవదంపతుల ముందు వినిపించారు. పండితులకు విసినకర్ర, మదురఫలాలు, నగదు పారితోషకం అందించారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు దంపతులు ఉన్నారు.





పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, శ్రీనివాసరావు దంపతులు

దివాన్‌చెరువు చూస్తే.. గుండె బరువు!



దివాన్‌చెరువు చూస్తే.. గుండె బరువెక్కుతోంది. నిన్నటి వరకూ ఈ సెంటర్ నిత్యం జనంతో కళకళలాడుతూ ఉండేది.. ప్రతి రోజూ లక్షల్లో వ్యాపారం సాగేది. అటువంటి సెంటర్‌లో ప్రస్తుతం అంతా నిశ్శబ్దమే.. ఎందుకంటే దివాన్‌చెరువు వద్ద జాతీయ రహదారిపై ఫ్లయ్ ఓవర్ నిర్మాణం నేపథ్యంలో మేడలు నేలవాలుతున్నాయి.. గాలిలో కలిసిపోతున్నాయి..గతంలో వేసిన మార్కింగ్‌ను మించి తొలగింపు చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేసినా ఏమాత్రం ఆగడం లేదు. యథావిధిగా పనులు సాగాయి.



చూసిన కనులదే భాగ్యమట : వేడుకగా స్వామి కల్యాణం

భక్తజనుల వాడా..

భక్తజనులవాడా.. వాడపల్లి వేంకటేశ్వరుడా అంటూ భక్తులు మొక్కారు.. కనులారా దర్శించుకుని.. మనసారా వేడుకున్నారు.. వాడపల్లి వేంకటేశ్వరుడి కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం ఉదయం రథోత్సవం సాగింది.. తిరువీధుల్లో ఊరేగిన స్వామిని కనులారా దర్శించుకుని ఏడుకొండలవాడా వెంకన్నా అంటూ కొలిచారు.. సాయంత్రం కల్యాణ క్రతువు వేడుకగా సాగింది. ప్రత్యేక అలంకరణలో స్వామి తమ చెంతకే రావడంతో కన్నులారా చూసిన భక్తజనం పులకించిపోయారు.. తన్మయత్వంతో ఊగిపోయారు. - వివరాలు 6లో

ఇక డిపాజిటర్లకు.. జయమే!



కాకినాడ జిల్లా సర్పవరం జంక్షన్‌లోని జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం

'జయ'ం జరిగేలా సర్కారు అడుగులు

- జయలక్ష్మి బాధితులకు అండ
- సీఎం దృష్టికి తీసుకువెళ్లిన కలెక్టర్
- సీఐడీతో ప్రభుత్వం సంప్రదింపులు
- రూ.450 కోట్ల ఆస్తుల వేలం
- 11న సీఎం చెంతకు పాలకవర్గం
- జూన్‌కల్లా కొంత చెల్లించే యత్నం
- గడువు విధించిన అధికారులు
- మూడేళ్ల కిందట ఘటన
- రూ.582 కోట్లకు శఠగోపం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఒకటి కాదు..రెండు కాదు..ఏకంగా రూ.582 కోట్ల కుంభకోణం..జరిగి మూడేళ్లయినా ఇప్పటికీ బాధితులకు న్యాయం దక్కలేదు.. గత వైసీపీ ప్రభుత్వం అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసేసి బాధితులకు తీరని అన్యాయం చేసింది.. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అండగా నిలబడేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించింది.. సీఐడీ సీజ్ చేసిన రూ.450 కోట్ల సొసైటీ ఆస్తులను ఎలాగైనా వేలం వేసి బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.ఈ మేరకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఇప్పటికే ఈ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో వేలం ప్రక్రియకు వేగంగా అడుగులు పడుతున్నాయి. తొలివిడత రూ.200 కోట్లయినా చేతికి అందితే బాధితులకు న్యాయం జరిగే అవకాశం ఉండడంతో ఆ దిశగా ప్రయత్నాలు ఊపందుకున్నాయి.అటు సొసైటీ పాలకవర్గం సైతం ఈ నెల 11న సీఎం చంద్రబాబును కలవడానికి సన్నాహాలు చేస్తోంది. బాధితులకు న్యాయం చేయాలని సీఎంను కోరనుంది.జూన్‌లోపు బాధితులకు 25 శాతమైనా నగదు చెల్లించాలని ప్రయత్నాలు చేస్తోంది.

ప్రభుత్వం మారడంతో చకచకా..

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇప్పుడు సొసైటీ బాధితులకు న్యాయం చేసేందుకు వేగం గా అడుగులు పడుతున్నాయి.ఇటీవల కలెక్టర్ల సదస్సులో ఈ అంశంపై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సీఎం చంద్రబాబుతో చర్చించారు. సీఐడీ అటాచ్‌లో ఉన్న రూ.450 కోట్ల స్థిరాస్తులను వేలం వేసేలా చర్యలు చేపడితే బాధితులకు న్యాయం జరుగుతుందని వివరించారు. తొలుత సీఐడీతో ప్రభుత్వం చర్చించి వేలం ప్రక్రియ ముందుకు సాగేలా ప్రస్తుతం చర్యలు చేపట్టింది. వేలానికి అన్నీ అనుకూలిస్తే నెల వ్యవధిలో ప్రక్రియ ముగించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.దీంతో బాధితుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. వైస్ చైర్మన్ విశాలాక్షి మేనల్లుడు ఆకెళ్ల ఉదయశంకర్ రూ.60 కోట్లతో లండన్ చెక్కేయడంతో సీఐడీ ఇప్పటికే లుక్ అవుట్ నోటీసు..తాజాగా రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేశారు.హైదరాబాద్‌లో నిందితుడికి చెందిన రూ.150 కోట్ల విలువైన 14 స్థిరాస్తులను సీఐడీ సీజ్ చేసింది. లోన్లు తీసుకున్న 235 మందిపై ట్రిబ్యునల్‌లో కేసు నమోదు చేయగా 40 మందిపై కోర్టులో నెంబర్ దాఖలైంది.

రూ.582 కుంభకోణానికి మూడేళ్లు

కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్ ప్రధాన కేంద్రంగా ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో ఎన్నో ఏళ్లుగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించేది. మూడేళ్ల కిందట ఈ సంస్థ డిపాజిటర్లను మోసం చేసింది. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, విశాఖ జిల్లాల్లో 29 బ్రాంచీల ద్వారా 20 వేల మంది నుంచి రూ.582 కోట్ల వరకు డిపాజిట్లు సేకరించి 2022 ఏప్రిల్ 6న బోర్డు తిప్పేసింది. బాధితుల ఆందోళనలతో ప్రభుత్వం విచారణకు ఆదేశించగా రూ.582 కోట్ల మేర ఆర్థిక మోసం జరిగినట్టు జిల్లా సహకారశాఖ, సీబీసీఐడీ అధికారులు 348 పేజీల నివేదికను 2023లో అప్పటి ప్రభుత్వానికి అందించారు. ఈ ఆర్థిక కుంభకోణానికి ప్రధాన సూత్రదారులుగా జయలక్ష్మి సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, వైస్‌చైర్మన్ రాయవరపు బదరీ విశాలాక్షి, ఇతర డైరెక్టర్లు రాయవరపు జయమణి, చక్రభాస్కరరావు, ప్రబల మల్లిఖార్జునరావు, మంగళంపల్లి వెంకటసుబ్రహ్మణ్యకుమార్, వారణాసి శాంతేశ్వరరావు, దూళ్ల శ్రీనివాస్, ఆర్.నాగేశ్వరరావు, జయశంకర్‌లుగా నిర్ధారించి నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. సీఐడీ విచారణ తర్వాత కుంభకోణంలో 159 మంది పాత్ర ఉన్నట్టు గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచింది. 98 ఆస్తులకు చెందిన రూ.450 కోట్ల విలువైన స్థిరాస్తులను సొసైటీ చొరవతో సీఐడీ సీజ్ చేసి కోర్టుకు అటాచ్ చేసింది. ఈ ఆస్తులపై సేల్ ఆర్డర్ కోసం ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో నడుస్తోంది. నూతన పాలకవర్గం చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు ఇది వరకే సొసైటీ నుంచి రుణాలు తీసుకున్న వారి నుంచి రూ.6 కోట్లు వసూలు చేసి బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఇంకో రూ.6 కోట్లు సీఐడీ సీజ్ చేసిన దాంట్లో కోర్టులో పెండింగ్‌లో ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నేతలు ఈ ఆస్తులపై కన్నేసి కొట్టేశారు.

త్వరలో మరిన్ని జీవోలు..

కుంభకోణానికి సంబంధించి 21,895 మంది డిపాజిట్‌దారులకు 2022 నాటికి వడ్డీతో కలిపి మొత్తం రూ.511 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్టు ఇప్పటికే లెక్కలు తేల్చారు. ప్రధానంగా రూ.లక్ష లోపు డిపాజిట్‌దారులు 13,249 మంది ఉండగా, రూ.32.72 కోట్లు చెల్లించాల్సి ఉంది. రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల మధ్య డిపాజిట్‌దారులు 2,384 మంది ఉండగా వీరికి రూ.37.83 కోట్లు, రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల్లోపు 810 మంది ఉండగా వీరికి రూ.27.99 కోట్లు, రూ.5 లక్షల లోపు 677 మంది బాధితులు ఉండగా వీరికి రూ.30.41 కోట్లు, రూ.5 లక్షలు ఆపైన బాధితులు 2,563 మంది ఉండగా వీరికి రూ.349 కోట్లు చెల్లించాల్సి ఉంది. రూ.582 కోట్ల కుంభకోణంలో వైస్ చైర్మన్ విశాలాక్షి ఒక్కరే ఎటువంటి పూచీకత్తు లేకుండా బినామీలతో రూ.300 కోట్లు కొట్టేయడం గమనార్హం. ఇప్పటి వరకు 98 ఆస్తులకు చెందిన రూ.450 కోట్ల స్థిరాస్తులను సీఐడీ సీజ్ చేయగా ఈ ఆస్తుల స్వాధీనానికి ప్రభుత్వం 12 జీవోలు జారీ చేసింది.మరో ఐదు జీవోలు విడుదల చేయాల్సి ఉండగా మరో వారంలో రూ.100 కోట్ల ఆస్తుల సీజ్ కోసం రెండు జీవోలు ప్రభుత్వం విడుదల చేసే అవకాశం ఉంది.

ప్రత్యేక ఆర్డినెన్స్ అవసరం

కూటమి ప్రభుత్వంలో జయలక్ష్మి సొసైటీ బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్న నమ్మకం కలిగింది. ఇటీవల కలెక్టర్ల సదస్సులో జయలక్ష్మి వ్యవహారంపై సీఎం చర్చించడం మంచి పరిణామం. ఇప్పటికే కలెక్టర్ ద్వారా సహకారశాఖ కమిషనర్, సీఐడీ ద్వారా సీఎంకు లెటర్లు పంపాం. సొసైటీ సమగ్ర నివేదిక, సీజ్ చేసిన ఆస్తులు, తదితర వివరాలన్నీ కలిపి సొసైటీ పాలకవర్గం సభ్యులతో ఈనెల 11న సీఎం చంద్రబాబును కలవబోతున్నాం. సొసైటీ బాధ్యతలు తీసుకున్న సమయంలో ఒక్క రూపాయికి కూడా లేని స్థితినుంచి రూ.500 కోట్లకుపైగా ఆస్తుల గుర్తింపు, స్వాధీనం చేసుకోవడంలో పోలీసు, సీఐడీకి సహకరించాం.బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువస్తే సేల్ ఆర్డర్స్ వేగంగా వచ్చే అవకాశం ఉంది.

- గంగిరెడ్డి త్రినాథరావు, చైర్మన్, జయలక్ష్మి సొసైటీ

పోలవరం.. పరుగు



- చకచకా సాగుతున్న పనులు
- ఇప్పటి వరకూ 55.9 శాతం
- ఒక పక్క డయాఫ్రం వాల్
- మరో పక్క ఈసీఆర్ఎఫ్ డ్యామ్
- 2027 డిసెంబర్‌కి ప్రాజెక్టు
- రెండేళ్లలో పూర్తిచేయడం లక్ష్యం
- సీఎం చంద్రబాబు రాకతో వేగం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయి. డయాఫ్రంవాల్ నిర్మాణానికి సన్నాహ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏడాది జనవరి 18న డయాఫ్రం వాల్ పనులు ఆరంభించారు. మొత్తం 1396.6 మీటర్ల మేర ఈ వాల్‌ను నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకూ 158.2 మీటర్ల మేర నిర్మించారు.ఇంకా సుమారు 1238 మీటర్ల వాల్ నిర్మించాల్సి ఉంది.ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీకి దీనిని పూర్తి చేసి 2026 జనవరి1కి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి నిర్ణయించుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. డయా ఫ్రం వాల్ మీదనే అసలు డ్యామ్ అయిన ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) నిర్మించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో డయాఫ్రంవాల్ నిర్మాణం పూర్తయ్యే వరకూ వేచి ఉండకుండా దానికి సమాంతరంగా ఇరువైపులా ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ నిర్మాణ పనులు చేయడానికి నిర్ణయించారు. ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1ను పూర్తి చేసే పనిలో అధికారులు, యంత్రాలు నిమగ్నమయ్యాయి. సీఎం నారా చంద్రబాబునాయుడు ఇటీవల స్వయంగా ప్రాజెక్టు పరిశీలించి అధికారులకు సూచనలు చేయడంతో పనులు వేగవంతం అయ్యాయి.2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని ప్రభుత్వం చెబుతోంది.

పనులు జరిగిన తీరిది..

ఇప్పటి వరకూ పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం పనులు 55.90 శాతం జరిగాయి.సివిల్ వర్క్ 78.56 శాతం, హెడ్ వర్క్ పనులు 76.43 శాతం,కుడి ప్రధాన కాలువ (ఆర్ఎంసి) పనులు 92.75 శాతం, ఎడమ ప్రధాన కాలువ(ఎల్ఎంసి) పనులు 74.43 శాతం, భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులు 25.11 శాతం జరిగాయి.వైసీపీలో చతికిలపడిన ప్రాజెక్టును కొత్త ప్రభుత్వం గాడిలో పెట్టింది.2024 జూన్ నుంచి ఇప్పటి వరకూ సుమారు 7 శాతం పనులు జరిగాయి.

ఇదీ యాక్షన్ ప్లాన్

పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్‌కు సంబంధించి అధికారులు స్పష్టమైన ప్రణాళికతో ఉన్నారు. ఈసీఆర్ఎఫ్ గ్యాప్ -1 పనులు 2024 డిసెంబర్ 10న ప్రారంభించారు.2026 మార్చి 31కి పూర్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారు. డయాఫ్రంవాల్ పనులు ఈ ఏడాది జనవరి 18న ఆరంభించారు.ఈ ఏడాది డిసెంబర్ 31కి పూర్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఈసీఆర్ ఎఫ్ గ్యాప్-2 పనులు ఇంకా మొదలుకాలేదు. ఇవి త్వరలో మొదలు పెట్టి 2027 డిసెంబర్ 27కి పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నారు.ఇవి పూర్తయితే ప్రాజెక్టు పూర్తయినట్టే. కుడి వైపు అనుబంధ పనులు వచ్చే ఏడాది జూలై 31కి పూర్తి చేయడంతో పాటు ఎడమ వైపు అనుబంధ పనులు 2027 ఫిబ్రవరి 28కి పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నారు.ఇక భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, కాలనీల నిర్మాణం, కుటుంబాల తరలింపు పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. మరో పక్క పవర్ ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయి.స్పిల్‌వే పూర్తి కావడంతో ఇప్పటికే గోదావరి నీటిని స్పిల్‌వే గుండా ధవళేశ్వరం బ్యారేజీ వైపు వదిలేస్తున్న సంగతి తెలిసిందే.



టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంతి

పీజీఆర్ఎస్ అర్జీలు 92 శాతం పరిష్కారం

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పరంగా పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల్లో 92 శాతం పరిష్కరించారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.అమరావతి నుంచి సీసీఎల్ఏ కమిషనర్ జి.జయలక్ష్మి మంగళవారం జిల్లా కలెక్టర్లతో పీజీఆర్ఎస్ అర్జీలు, వాటర్ టాక్స్, భూముల క్రమబద్ధీకరణ అంశాలపై నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు.జిల్లా వ్యాప్తంగా పీజీఆర్ఎస్‌లో 6765 అర్జీలకు 6226 పరిష్కరించినట్టు తెలిపారు. ఇంకా 529 అర్జీలు పరిష్కరించాల్సి ఉందన్నారు. భూముల క్రమబద్ధీకరణకు ఇప్పటి వరకు 278 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీఆర్వో 251, ఆర్ఐ 27 పరిశీలించారని తెలిపారు. 150 గజాల్లోపు 271 దరఖాస్తులు 151-300 గజాల్లోపు 6 దరఖాస్తులు 450 గజాలు పైబడి ఒక్క దరఖాస్తు వచ్చినట్టు తెలిపారు. నీటి తీరువా పన్నుల వసూళ్లకు సంబంధించి 272 రెవెన్యూ గ్రామ పంచాయతీలకు ఇప్పటి వరకు 254 పంచాయతీల పరిధిలో వసూళ్లు పూర్తి చేసినట్టు తెలిపారు.సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తి,జిల్లా ల్యాండ్ సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్యాష్ కొట్టు.. భూమి సరిపెట్టు!

- నాడు రీసర్వే తప్పుల తడక
- నేడు రైతుల సతమతం
- సరిచేసుకునేందుకు అష్టకష్టాలు
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- డబ్బులిస్తేనే తొలి ప్రాధాన్యం
- జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి



గోకవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన రీ సర్వే రైతులకు అనేక కొత్త తలనొప్పులను తెచ్చిపెట్టింది. పొలాల హద్దులు రూపు మారి పోవడం, సర్వే నెంబర్లలో తేడాలు, ఒకరి భూమి మరొకరి పేరు మీదకు మారడం ఇలా పలు రకాల ఇబ్బందులను రైతులు చవి చూశారు. అప్పట్లో ఎదురైన భూ ఇబ్బందులను పరిష్కరించుకునేందుకు బాధిత రైతాంగం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఎటువంటి న్యాయం జరగలేదు. తరువాత కొంతకాలానికి ప్రభుత్వం అధికారం చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ సమస్యలను పరిష్కరించేందుకు రంగం సిద్ధం చేసింది. దీనిలో భాగంగా గత డిసెంబరు 6వ తేదీ నుంచి జనవరి 8 వరకు ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. బాధిత రైతుల నుంచి భూ పరమైన సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించింది. ఇంత వరకూ బాగానే ఉంది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కొంత మంది రెవెన్యూ సిబ్బంది నుంచి సరికొత్త కష్టాలు ఎదురవు తున్నాయి. భూ సమస్యల పరిష్కారం పేరుతో జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా సర్వేయర్లు, కొంతమంది గ్రామ స్థాయి రెవెన్యూ అధికారుల చేయి తడపనిదే సమస్య పరిష్కారం కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఎవరైనా గట్టిగా నిల దీస్తే పని ఒత్తిడి ఉందంటూ రైతులను తమ చుట్టూ తిప్పుకుంటున్నారు. ముడుపులు ఇచ్చిన దానిని బట్టి కూడా సర్వేయర్లు కొలతల్లో తేడాలు చూపిస్తున్నారు.ఉదాహరణకు గోకవరం మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధికారులకు సుమారు 212 అర్జీలు అందాయి.వాటిలో ప్రత్యేకంగా సుమారు 152 అర్జీలే సర్వే కోసం అధికారులకు అందాయంటే ఇక్కడి రైతులు భూపరమైన సమస్యలను ఎలా ఎదుర్కొంటున్నారో, వాటి పరిష్కారానికి సర్వేయర్లు ఎలా పని చేస్తున్నారో అర్థమవుతుంది. అర్జీదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నచ్చిన వారికి ఒకలా నచ్చని వారికి మరొకలా పని కానిచ్చేస్తున్నారు. ఒకవేళ అసహనంతో ఏ రైతైనా తిరగబడితే ఈవేళ అర్జెంట్ పని ఉందంటూ తమ పంతం తీర్చుకుంటున్నారనే బలమైన ఆరోపణలు లేకపోలేదు.ప్రభుత్వ రికార్డుల్లో ఏర్పడిన ఇబ్బందుల దృష్ట్యా రైతులను మాటలతో భయపెట్టి తరువాత జేబులు నిండాక బాధిత రైతులను సంతప్తి పరుస్తున్నారు. కొంతమంది అమాయక రైతుల బలహీనతలను రెవెన్యూ సిబ్బంది క్యాష్ చేసుకుంటున్నారు.

యథావిధిగా ఎన్టీఆర్ వైద్యసేవలు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలు మంగళవారం నుంచి యథావిధిగా కొనసాగుతున్నాయి. స్పెషాలిటీ ఆసుపత్రుల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు విజయవంతం కావడంతో వైద్యసేవలు తిరిగి ప్రారంభించారు. బకాయిలు చెల్లించకపోతే ఈ నెల 7వ తేదీ నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని స్పెషాలిటీ ఆసుపత్రుల యాజమాన్య సంఘం గతంలో చేసిన ప్రకటనకు అనుగుణంగా సోమవారం వైద్యసేవలను నిలిపివేశారు. దీనిపై సీఎం చంద్రబాబు తక్షణమే రూ.500 కోట్లు విడుదల చేయాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆసుపత్రుల సంఘం ప్రతినిధులు సమ్మె విరమించినట్టు జిల్లా కో ఆర్డినేటర్ ప్రియాంక తెలిపారు.

బాధ్యతల నిర్వహణలో నైతికత అవసరం

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బాధ్యతల నిర్వహణలో నైతికత అవసరమని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం ఆర్డీవోలు, తహశీల్దార్లు, మండల సర్వే అధికారులకు రెవెన్యూ సంబంధిత అర్జీలు,వాటి పరిష్కారాలపై దిశా నిర్దేశం చేశారు. అర్జీల పరిష్కార విధానంలో మూడు ప్రధాన అంశాలను గుర్తెరగాలన్నారు. ప్రతి వారం సీఎం అర్జీలపై సమీ క్షిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణకు అనుమతిపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

చివరికి.. మళ్లీ పరుగులే!

దేవరపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అకాలవాన అన్నదాతను ఏడిపిస్తోంది.. నిండు వేసవిలో వరుణ దాడి తెలియక రైతాంగం లబోదిబోమంటున్నారు. వాతావరణ మార్పులతో ఉరుకులు..పరుగులు పెడుతున్నారు.దేవరపల్లి మండలంలోని గౌరీపట్నం, దుద్దుకూరు, త్యాజంపూడి, కృష్ణం పాలెం, రైతులు తాము ఆరుగాలం పండించిన పంటను జాతీయ రహదారులకు ఇరువైపులా ఆరబెట్టారు. ఉదయం నుంచి భానుడు మండిపడ్డాడు.. వాతావరణం బాగానే ఉందని ఎక్కడ వారు అక్కడ సర్దుకున్నారు. మంగళవారం సాయంత్రం అకాల వర్షం రావడంతో ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు పరుగులు తీశారు. ధాన్యం పోగేసి బరకాలు కప్పారు.అయినప్పటికి వర్షం వల్ల కింద నుంచి తేమచేరి రంగుమారడం, మొలకలు రావడం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పల్లంట్ల, కురుకూరు, లక్ష్మీపురం గ్రామాల్లో కళ్లేలపై ఆరబెట్టిన ఎండుమిర్చి వర్షానికి తడిచి ముద్దయ్యింది. దీని వల్ల రంగు మారి కాయలు గుల్లబారతాయని రైతులు వాపోతున్నారు. అకాల వర్షం కారణంగా మొక్కజొన్న, పొగాకు తోటలకు నష్టం వాటిల్లింది. ఈదురుగాలుల కారణంగా యర్నగూడెం ప్రధాన సెంటర్‌లో ఒక్కసారిగా కొబ్బరిచెట్టు పడింది. అల్పపీడన ప్రభావంతో భారీ ఈదురుగాలులు, భారీ వర్షంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది.



దుద్దుకూరు వద్ద ఇలా..

అకాలవాన : గౌరీపట్నం జాతీయరహదారిపై తడుస్తున్న ధాన్యానికి.. తడుస్తూ బరకాలు కప్పుతున్న రైతులు

రబీలో ఆశాజనకంగా వరి దిగుబడి

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రబీలో వరి పంట ఆశాజనకంగా పడిందని జిల్లా గణాంకశాఖ జాయింట్ డైరక్టర్ అప్పలకొండ తెలిపారు. మండలంలోని రాజవోలులో వ్యవసాయక్షేత్రంలో వరి పంటకోత ప్రయోగం చేయగా ప్రయోగ ప్లాటులో 30.250 కిలో గ్రాములు, బొమ్మూరు గ్రామ వ్యవసాయ క్షేత్రంలో ప్రయోగం చేయగా 25.310 గ్రాముల దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఉప గణాంక అధికారి సూర్యనారాయణ, వ్యవసాయ విస్తర ణాధికారి పీటర్, వీఏవోలు హేమంత్ నాగసు రేష్, ఎస్.రాహుల్, దుర్గబాబు, ఎస్‌బీఐ బీమా అధికారి ఎల్.శ్రీధర్‌బాబు, రైతులు పాల్గొన్నారు. అనంతరం బొమ్మూరులోని గిరిజన సంక్షేమ హాస్టల్‌ను సందర్శించి సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలి

ప్రభుత్వ బోధనాసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ తనిఖీలు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ మంగళవారం ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లోనూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా విభాగాల్లో వైద్యులు, నర్సులు, ఇతర సపోర్టింగ్ స్టాఫ్ ఉన్నారా లేదా అని తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందేలా వైద్యసిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సమయానికి వైద్యసేవలు అందించడంతోపాటు రోగుల పట్ల దయాగుణం కలిగి ఉండాలని సూచించారు. వైద్యసేవల విషయంలో రోగులు సంతృప్తి చెందేలా ఉద్యోగులు పనిచేయాలని కోరారు. జీటీజీహెచ్‌లో ఆరోగ్య ప్రమాణాలను మెరుగుపర్చడంలో భాగంగా ముఖ్యమైన చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ వెల్లడించారు.

ఉద్యోగాల పేరుతో మోసంపై విచారణ

కాగా, ఆసుపత్రిలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురిని మోసం చేసిన యువతికి సంబంధించిన విషయంపై ప్రభుత్వ బోధనాసుపత్రి అధికారులు మంగళవారం అంతర్గత విచారణ జరిపారు. కొందరు ఉద్యోగులను పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మోసానికి పాల్పడిన యువతితో తమకు ఎలాంటి సంబంధంలేదని, ట్రైనింగ్ కోసం వచ్చిన స్టూడెంట్‌ను అని చెప్పి కొద్దిరోజులు తమ విభాగంలో పని చేసిందని, ఆమె గురించి తమకు ఏమీ తెలియదని ఈ సందర్భంగా విచారణాధికారుల ఎదుట ఉద్యోగులు చెప్పినట్టు తెలిసింది. కాగా, ఈ విషయంపై ఆసుపత్రి అధికారులు కొన్నాళ్ల క్రితమే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

‘వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ ఉల్లంఘనే’

రాజమహేంద్రవరం సిటీ/అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దేశంలోని ముస్లింల అస్తిత్వాన్ని ప్రశ్నించేలా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఆమోదింప చేసుకుందని, ఈ బిల్లు రాజ్యాంగ ఉల్లంఘనే అని జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ ఛైర్మన్ ఎండీ ఆరీఫ్, సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ రాజమహేంద్రవరం కమిటీ కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఇద్దరూ రాజమహేంద్రవరంలో వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఉన్న సుమారు 22కోట్ల మంది ముస్లింల అస్తిత్వాన్ని అస్థిరపరిచే విధంగా ఎన్‌డీఏ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వక్ఫ్ సవరణ చట్టం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ బిల్లుకు తెలుగుదేశం, జనసేన పార్టీలు మద్దతు తెలపడం ద్వారా దేశంలోని ముస్లింల మేలును కోరుకోవడం లేదనే విషయాన్ని రుజువు చేస్తున్నాయన్నారు. ముస్లిం సంస్థల ఆస్తులను కాజేసే కుట్రతోనే ఈ బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపంగా శాంతి ర్యాలీ

గోకవరం, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా మంగళవారం గోకవరంలో శాంతి ర్యాలీ జరిగింది. మండల క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ గ్రామం లోని ప్రధాన రహదారుల గుండా రెవెన్యూ కార్యాలయానికి చేరుకొం ది. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతిపై వ్యాపిస్తున్న వదంతులు నిలిచిపోవాలంటే పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి నిజాలను నిగ్గు తేల్చాలన్నారు. భవిష్యత్‌లో క్రైస్తవులపై ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్య

అనపర్తి ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదవి అవాస్తవాలు పలకడం మంచిది కాదని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బెళ్ళ సత్యనారాయణరెడ్డి(సత్య) అన్నారు. మంగళవారం రామవరంలోని ఎన్డీయే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామవరంలో పేకాట క్లబ్బు జరుగుతుందని దీని కోసం భవనం కూడా నిర్మించారని రోజుకు లక్షల్లో ఆదాయం పొందుతున్నారంటూ మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యల్లో నిజం లేదన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గమంతా క్లబ్బులు ఏర్పాటు చేసిన వైసీపీ నేతలు ఇప్పుడు కూడా అదే జరుగుతుందని భ్రమపడి వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆధారాలు లేకుండా అవాస్తవాలు పలికితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. సమావేశంలో తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

శ్రీరంగపట్నంలో మట్టి నమూనాల సేకరణ

కోరుకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆర్ఏడబ్ల్యూఈపీ ప్రోగ్రామ్‌లో భాగంగా శ్రీరంగపట్నంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం మంగళవారం 5వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మట్టి నమూనాల సేకరణ, వ్యవసాయ యాంత్రీకరణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భూసార పరీక్షల చేయించుకోవడం వల్ల వల్ల ఏ నేలలో ఏ పంట వేస్తే బాగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయో తెలుస్తుందన్నారు. దీని ద్వారా పంటపై పెట్టుబడి తగ్గడమే కాకుండా దిగుబడులు వల్ల మంచి ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డీన్ డి.శ్రీనివాస్, ప్రొఫెసర్ ఉషారాణి, ఇంజనీరింగ్ ప్రొఫెసర్ గంగాధర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ హెచ్.శ్రీనివాస్, సునీత, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

రాజానగరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ గొలుగూరి బాపిరాజు తెలిపారు. ఓ వాహనంలో 2 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా రాజానగరం హైవేపై పిరమిడ్ రెస్టారెంట్ సమీపంలో పట్టుకున్నామన్నారు. రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన డ్రైవర్ వట్టికూటి మణికంఠ, రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామానికి చెందిన మాదబోయిన గోపి నుంచి అద్దెకు తీసుకుని రేషన్ బియ్యాన్ని అనపర్తి నుంచి గండేపల్లికి తరలిస్తున్నట్టు డ్రైవర్ చెప్పాడన్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.96 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసును నమోదు చేసి, రాజానగరం పోలీస్‌స్టేషన్‌కు తరలించామని డీటీ తెలిపారు.



ధవళేశ్వరంలో గోవిందుడికి అలంకరణ



కడియపులంకలో వేంకటేశ్వరుడికి పూజలు

కన్నుల పండువగా శ్రీలక్ష్మీనారాయణుల కల్యాణం

బిక్కవోలు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో శ్రీలక్ష్మీ నారాయణుల కల్యాణం మంగళవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు స్వామి అమ్మవార్లను ఉదయం పెండ్లి కుమారుడు, కుమార్తెలుగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. సాయంత్రం విశ్వక్సేన పూజ, అంకురార్పణ, ధ్వజారోహణ, గరుడ ప్రతిష్ఠ, ప్రధాన హోమాలు, రాత్రి కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ ప్రసాదాన్ని అందజేసారు.

వేంకటేశ్వరస్వామి కళ్యాణం

కడియం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కడియపులంక హరిహర మహాక్షేత్రంలో శ్రీదేవిభూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ఛైర్మన్ మార్గాని సత్యనారాయణ, లక్ష్మి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కళ్యాణం జరిగింది. ఆలయ కమిటీ, నర్సరీరైతులు, భక్తులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: శ్రీదేవిభూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం అశేష భక్తజనం మధ్యవైభవంగా జరిగింది. నయనానందకరంగా అలంకరించిన స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆశీనులు చేసి మేళతాళాలుతో ఊరేగింపుగా జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్మించిన కల్యాణ వేదిక వద్దకు తీసుకెళ్లి ఆశీనులను చేశారు. అర్చకులు కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలు, పూలమాలతో అలంకరించారు. తీర్చిదిద్దారు. ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటుచేసి భక్తులందరూ వీక్షించే విధంగా కల్యాణోత్సవాన్ని ప్రత్యక్ష ప్రచారం చేశారు. విచ్చేసిన ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ చల్లా శంకర్రావు, టీడీపీ నాయకుడు మార్ని వాసుదేవరావు, జనసేన నాయకుడు యడ్ల మహేష్ తదితరులు స్వామి వారిని దర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నీలి కోటేశ్వరరావు, ఎ.దుర్గాపార్వతి, దిండి జగదీష్‌గుజ్జల సూరిబాబు, ఆపోజు ఏసు, ఈవో నాగసురేష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆరోగ్యశ్రీ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవలు) బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వైద్యసేవలకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామాల ప్రగతే ప్రభుత్వ లక్ష్యం

» జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ
» పలు గ్రామాల్లో పల్లె పండగ



కామరాజుపేటలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల ప్రగతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కామరాజుపేట, కొత్తపల్లి, గోకవరం, తిరుమలాయపాలెం, మల్లవరం గ్రామాల్లో సుమారు రూ.1.65 కోట్ల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రోడ్ల మరమ్మతులకు ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని అన్ని రోడ్లకు మరమ్మతులు చేపట్టడంతోపాటు, శాశ్వత రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి, యువతకు ఉద్యోగాల కల్పనపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారని పేర్కొన్నారు. కామరాజుపేటలోని దుర్గా కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే నెహ్రూ స్పందించి పట్టాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గోకవరంలో ప్రభుత్వాసుపత్రి సమీపంలో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయ సమీపంలో ఉన్న రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు, సేకరించిన ధాన్యంతో మిల్లర్ల వద్దకు బయలుదేరిన వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, నాయకులు అడపా భరత్, కన్నబాబు, ఉంగరాల రాము, పాలూరి బోస్, జనపరెడ్డి సుబ్బారావు, మంగరౌతు రాము, ఎస్వీఎస్ అప్పలరాజు, గాజింగం సత్తిబాబు, అడపా వెంకట్రావు పాల్గొన్నారు.

నేటి నుంచి ‘పల్లె పండగ’ వారోత్సవాలు

రాజానగరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి పనుల్లో భాగంగా నేటి నుంచి పల్లె పండగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పల్లె పండుగతో సీసీ రోడ్లు నిర్మాణంతో పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తాయన్నారు.రెండో దశలో మరిన్ని సీసీ రోడ్లు అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గంలో పలు గ్రామాల మధ్య రహదారులను అనుసంధానం చేస్తూ సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 9న రాజానగరం మండలం తోకాడ గ్రామంలో ఉదయం 9గంటలకు సీసీ రోడ్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. అనంతరం కోరుకొండ, సీతానగరం మండలాల్లో రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి, జనసేన పార్టీ నాసేన కోసం నావంతు కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొంటారన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు

» కుక్కల దాడిలో బాలుడు మృతి చెందడం దురదృష్టకరం
» ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కుక్కల దాడిలో ఒక బాలుడు మృతిచెందడం దురదృష్టకరమని, ఇటువంటివి మరెక్కడా జరగకుండా కుక్కలను నియంత్రించేందుకు మునిసిపల్ శాఖ, వైద్యఆరోగ్యశాఖ సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరంలో 20 వేల కుక్కలు ఉన్నాయని, వాటిలో 13 వేల కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేయించి, యాంటీ రేబిస్ ఇంజక్షన్లను కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ అధికారులు వేయించారన్నారు. క్వారీ ప్రాంతంలోని ఏబీసీ సెంటర్ ద్వారా రోజుకు 15 కుక్కలకు ఆపరేషన్లు చేసేవారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ సెంటర్‌ను తనిఖీ చేశామన్నారు. అవసరమైన పరికరాల ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం రోజుకు 50 కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్ చేసి యాంటి రేబిస్ ఇంజెక్షన్లు చేసే అవకాశం కల్పించామన్నారు. రాజమహేంద్రవరంలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే పందుల బెడద లేకుండా చర్యలు చేపడతామన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం పాటుపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఇటీవల ఒకరికి లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ శస్త్ర చికిత్సకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.10 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించినట్టు పేర్కొన్నారు. ఇంకా సీఎంఆర్ఎఫ్‌కు 60 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని అవి కూడా త్వరలో మంజురవుతాయని తెలిపారు. సమావేశంలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఏబీసీ సెంటర్ ప్రాజెక్టు ఇన్‌చార్జి డాక్టర్ అరుణ దేవి, ఈఈ షేక్ మదర్షాఆలీ, ఏఈ జి.షర్మిళ తదితరులు పాల్గొన్నారు.

ఐసీఏఆర్-ఎన్ఐఆర్‌సీఏలో ఆవిష్కర్తల ఆత్మీయ కలయిక



సమావేశంలో శాస్త్రవేత్తలు

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్-ఎన్ఐఆర్‌సీఏ)లో మంగళవారం ఆవిష్కర్తల ఆత్మీయ కలయిక జరిగింది. ఈ సందర్భంగా ఐసీఏఆర్-ఎన్ఐఆర్‌సీఏ సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ మాట్లాడుతూ వ్యవసాయంలో వాణిజ్య పరమైన వినూత్న ఆవిష్కరణలు అవకాశాలతో పాటు వాణిజ్య పంటల ఉత్పత్తుల దిగుమతు లు తగ్గించుకునే దిశగా రైతాంగం, ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్త లు, అంకుర సంస్థలు కృషి చేయాలన్నారు. ప్రతి రైతు ఒక పారిశ్రామికవేత్తగా ఎదగాలని,వ్యవసాయా న్ని పరిశ్రమగా చేపట్టాలని, వాణిజ్య పంటల విలువ ఆధారిత పదార్థాల ఎగుమతులను పెం చే దిశగా పరిశోధన జరగాలన్నారు. ఆన్‌లైన్‌లో పాల్గొన్న న్యూఢిల్లీ ఐసీఏ క్యూర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నీరు భూషణ్ హాజరయ్యారు. ఆయన తరపున హాజరైన డాక్టర్ విక్రమ్‌సింగ్, గౌరవ అతిథులుగా హాజరైన ఐసీఏఆర్-ఐఐఎంఆర్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ సితారా సత్యవతి, ఏ-ఐ డియా సీఈవో డాక్టర్ ఎస్.సెంథిల్ వినాయగం, ఐసీఏఆర్ ఎన్ఏఏఆర్ఎం హైదరాబాద్ ఎన్.నటరాజ్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ హైదరాబాద్ డాక్టర్ వైసోమునాయుడు, నాబార్డ్ జిల్లా జీఎం ఆర్‌పీ నాయుడు, ఏపీఈ డీప హైదరాబాద్ ఏజీఎం డాక్టర్ రంజిత్‌సింగ్ లు హాజరయ్యారు. నోడల్ ఆఫీసర్, శాస్త్రవేత్త డాక్టర్ హెచ్.రవిశంకర్ ఈ ఆవిష్కర్తల కలయిక సమావేశం ముఖ్యఉద్దేశాన్ని వివరించారు. అనంతరం అతిథులు వారి ఆవిష్కరణలను వివరించారు. ఈ కలయికలో సీటీఆర్ఐ సీనియర్ శాస్త్రవేత్తలు బి.హేమ, డాక్టర్ కె.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వైద్యుల నిర్లక్ష్యం వల్ల మరణించాడంటూ ఆసుపత్రి వద్ద కుటుంబీకుల ఆందోళన





ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, సత్యనారాయణ(ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యానికి ఒక వ్యక్తి మృతిచెందాడంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కడియం మండలం దుళ్ళ గ్రామానికి చెందిన జి.సత్యనారాయణ(55) ఇటుక బట్టీలో పని చేస్తున్నాడు. ఈనెల 6న ఆలమూరు మండలం మడికి గ్రామంలో ట్రాక్టర్ పైనుంచి జారి పడడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. దీనిపై ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. సత్యనారాయణను కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే అతడి కాళ్లకు సర్జరీ చేయాలని ఆసుపత్రి వైద్యుడు సూచనలతో ఈనెల 7న దానవాయిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ఆదేరోజు రాత్రి ఆపరేషన్ చేశారు. అయితే మంగళవారం ఉదయానికి సత్యనారాయణ మరణించి ఉన్నాడని మృతుడి కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. మృతుడి చిన్నకుమారుడు ప్రసాద్ మాట్లాడుతూ ఐసీయూలో ఉన్న తన తండ్రిని వైద్యులు పట్టించుకోలేదని చాలా బాధ్యతా రహిత్యంగా వ్యవహరించడం వల్ల తన తండ్రి మరణించాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆసుపత్రి నుంచి అంబులెన్స్‌లో మృతదేహాన్ని పంపించి వేసేందుకు ప్రయత్నం చేయడంతో వారు అంబులెన్స్ వద్ద అడ్డంగా కూర్చుని ధర్నా చేశారు. వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సత్యనారాయణ కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని తరలించారు. సత్యనారాయణ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని పదే పదే కుటుంబ సభ్యులు అంటున్నా వారి వేదన అరణ్య రోదనగానే మారింది. ఇదిలావుండగా సత్యనారాయణ గుండెపోటుతో మృతిచెందాడని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. తమ విధులకు సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఆటకం కలిగించారని ఆసుపత్రి నిర్వాహకులు ఫిర్యాదు చేయగా వైద్యులు నిర్లక్ష్యం చేసి సత్యనారాయణను చంపేసారని బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్యనారాయణ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

15న అప్రెంటీస్‌షిప్ మేళా

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 15న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఐటీఐ పాసైన అభ్యర్థులకు జిల్లాలో ప్రముఖ బ్లూస్టార్, శ్రీసిటీ సంస్థల్లో అప్రెంటీస్ షిప్ కోసం ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళా ఆంధ్రపేపర్ లిమిటెడ్, రాజమహేంద్రవరం, కడియం యూనిట్లలో, హిందుస్తాన్ యూనిలీవర్ లో ఐటీఐ ఫిట్టర్ పాసయిన అభ్యర్థులకు రాత పరీక్ష జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్ల కాపీలతో ప్రభుత్వ ఐటీఐ రాజమహేంద్రవరంలో ఈ నెల 13 లోగా అందజేయాలని తెలిపారు.

బుర్రిలంకలో వంగవీటి రంగా విగ్రహావిష్కరణ

కడియం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహనరంగా సేవలు మరువలేనివని మాజీ ఎంపీపీ, టీడీపీ సీనియర్ నాయకుడు పాటంశెట్టి సూర్యచంద్రరావు తెలిపారు. బుర్రిలంకలో మంగళవారం జరిగిన వంగవీటి రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, నర్సరీ సంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, జనసేన నాయకులు పాటంశెట్టి సుబ్బారావు, అడ్వకేట్ కొత్తపల్లి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మోరంపూడిలో ఎల్ఐసీ ఉద్యోగుల చలివేంద్రం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మోరంపూడి జంక్షన్ వద్ద ఎల్ఐసీ డివిజనల్ ఆఫీసు ఎదుట డివిజనల్, రూరల్ బ్రాంచి ఉద్యోగుల సహకారంతో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజనల్ ఆఫీసు ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మాధ్యూస్, మేనేజర్లు సత్యనారాయణ, సాహెరా, రేఖ, ప్రసాద్, నాయకులు వీఎస్ఎస్ రాజు, గన్నయ్య, విశ్వనాథ్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన వసంత నవరాత్రి వేడుకలు

బిక్కవోలు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కొంకుదురు బుడతల మామిడి వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది నాడు ప్రారంభమైన వసంత నవరాత్రి వేడుకలు సోమవారం రాత్రి ముగిసాయి. ఈ సందర్భంగా అర్చకులు స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మల్లిడి కోదండం బ్రదర్స్ భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

సారా విక్రేత అరెస్టు

అనపర్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుప్పలపూడిలో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు రంగంపేట ఎక్సైజ్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు మెంబరు మండలి అన్నిబాబు సారా విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వేద పాఠశాలకు లయన్స్ క్లబ్ సేవలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కొంతమూరులోని ప్రముఖ దత్తాత్రేయ వేద పాఠశాలను లయన్స్ క్లబ్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వేద విద్యార్థులకు పరుపులు, కుర్చీలు, అల్మారాలు, గోవులకు పశుగ్రాసం కింద రూ.10 వేల నగదును జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌కుమార్ మాట్లాడుతూ, సనాతన ధర్మాన్ని కాపాడడంలో వేద విద్యార్థులు ఎంతో పాత్ర పోషిస్తున్నారని, తల్లిదండ్రులను విడిచి ఇక్కడ వేద విద్యనభ్యసించడం సాహసమేనన్నారు.

విద్యార్థులు ఉన్నతవిద్యలో రాణించాలి



తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల కష్టాన్ని విద్యార్థులు గుర్తించి ఉన్నత విద్యలో రాణించాలని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్‌ను మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గూడెం క్యాంపస్‌లో వనరులు, వసతులు సమకూర్చి క్యాంపస్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మహిళా వసతిగృహాన్ని సందర్శించి మెస్‌లోనే భోజనం చేశారు. విద్యార్థులకు గోరుముద్దలు తినిపించి అమ్మలా లాలించి వారి ఆలనా పాలనా తెలుసుకున్నారు. అధ్యాపకులు నాణ్యమైన బోధనందించాలని, విద్యార్థుల ఉన్నతిని ఆకాంక్షిస్తూ విద్యను బోధించాలన్నారు. క్యాంపస్‌లో సిబ్బంది హాజరు, పని తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో గూడెం క్యాంపస్ ప్రిన్సిపాల్ టి.అశోక్ పాల్గొన్నారు.

కార్మిక నాయకుడు ధర్మరాజుకు సత్కారం

ధవళేశ్వరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం పీడబ్ల్యూ వర్క్‌షాప్‌లో అప్రెంటీస్‌గా విధుల్లో చేరి కార్మిక నాయకుడిగా ఎదిగి టీఎన్‌టీయూసీ అనుబంధ తెలుగునాడు పీడబ్ల్యూ వర్క్‌షాప్ అండ్ ప్రాజెక్టు కార్మిక సంఘాన్ని స్థాపించి కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తూ 2013లో పదవి విరమణ చేసిన యర్రమోతు ధర్మరాజును పీడబ్ల్యూ వర్క్‌షాప్ ఉద్యోగులు, కార్మికులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ధర్మరాజు సేవలతెలుగునాడు కార్మిక సంఘం అధ్యక్షుడు చిటికెన శ్రీకృష్ణ కొనియాడారు. 2015లో మేడే సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి చేతులమీదుగా శ్రమశక్తిపురస్కారం అందుకోవడం ఆయన సేవలకు నిదర్శనమన్నారు. అనంతరం ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో పి.ప్రభాకరావు, పి.సత్యనారాయణ, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు చిట్టూరి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ రైతులకు అండగా ప్రభుత్వాలు

డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్



కడియం నర్సరీ సంఘ సభ్యులతో రవిరామ్‌కిరణ్

కడియం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నర్సరీ రైతులకు అండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయని టీడీపీ వైద్య విభాగం రాష్ట్ర నాయకుడు డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ అన్నారు. కడియం సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ సంఘంతో మంగళవారం ఆయన భేటీ అయ్యారు. మార్కెటింగ్ మరింతగా పెంపొందించేందుకు నర్సరీ ఎక్స్‌పో, ఫెస్టివల్ వంటివి నిర్వహిస్తే బాగుంటుందన్నారు. పూనే తరహా మన నర్సరీ రైతులు టిష్యూ కల్చర్ విధానంలో మొక్కల ఉత్పత్తి చేయాలని, రైతులకు కావాల్సిన ఉపకరణాలు సబ్సిడీలో అందించేందుకు కృషి చేస్తామన్నారు. నర్సరీ సంఘ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప మాట్లాడుతూ 2000 సోలార్ యూనిట్లు అవసరం ఉందని వాటిని నర్సరీ రైతులకు రాయితీలో అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని, జనసేన అధ్యక్షుడు ముద్రగడ జమీ, బోడపాటి గోపి, కొండేపూడి నాగు, తాడాల నాగేశ్వరరావు, గాజుల రత్తయ్య, రత్నం బాబ్జి, కొవ్విడి వాసు, ఉద్యాన అధికారి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

మానసిక ఆసుపత్రిని సందర్శించిన డీఎల్ఎస్ఏ సెక్రటరీ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మానసిక రుగ్మతల నుంచి ఉపశమనం పొందిన వారిని వారి కుటుంబ సభ్యులతో కలపడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ ఆదేశించారు. ఆ విషయంలో ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా డీఎల్ఎస్ఏ తరఫున అందిస్తామన్నారు. మంగళవారం ఆమె మానస, స్నేహ, హరిత, విజయ, జీఎస్ఎల్ వైద్య కళాశాలలోని మానసిక వైద్య విభాగాలను పరిశీలించారు. వైద్య సదుపాయాలపై ఆరా తీశారు.


ఆహ్వాన సుమాంజలి
విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు
అన్న NTR పిలుపుతో
తెలుగుదేశం పార్టీలో రాజకీయ
అరంగేట్రం చేసి, 42 సం॥లు
సుదీర్ఘ కాలం పార్టీలో విశిష్ట సేవలు అందిస్తున్న
మహోన్నత వ్యక్తి, అపర చాణుక్యుడు, మేథా సంపన్నులు
శ్రీ యనమల రామకృష్ణుడు గారికి
"42 వసంతాలు రాజకీయ ప్రస్థానం"
వేడుక నిర్వహించబడుచున్న సందర్భంగా అందరూ
విచ్చేయవలసిందిగా కోరి ప్రార్థిస్తున్నాము.
యనమల
42 వసంతాల
రాజకీయ ప్రస్థానం
42 వసంతాలు రాజకీయ ప్రస్థానం "పుస్తకావిష్కరణ"
గౌరవనీయులు శాసనసభ స్పీకర్
శ్రీ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారి
సువర్ణ హస్తాల మీదుగా జరుపబడును.
వేదిక:
సాయి వేదిక
ఫంక్షన్ హాలు,
తుని
తేదీ, సమయం
ది.10-04-2025
గురువారం
సా॥ 4 గం॥లకు
గౌ॥ శ్రీ యనమల రామకృష్ణుడు గారు
MA., LLB
రాష్ట్ర టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు
గౌ॥ శ్రీమతి యనమల దివ్య గారు
రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు
ఎమ్మెల్యే, తుని నియోజకవర్గం
తెలుగుదేశం పార్టీ - తుని నియోజకవర్గం





పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, శ్రీనివాసరావు దంపతులు

దివాన్‌చెరువు చూస్తే.. గుండె బరువు!



దివాన్‌చెరువు చూస్తే.. గుండె బరువెక్కుతోంది. నిన్నటి వరకూ ఈ సెంటర్ నిత్యం జనంతో కళకళలాడుతూ ఉండేది.. ప్రతి రోజూ లక్షల్లో వ్యాపారం సాగేది. అటువంటి సెంటర్‌లో ప్రస్తుతం అంతా నిశ్శబ్దమే.. ఎందుకంటే దివాన్‌చెరువు వద్ద జాతీయ రహదారిపై ఫ్లయ్ ఓవర్ నిర్మాణం నేపథ్యంలో మేడలు నేలవాలుతున్నాయి.. గాలిలో కలిసిపోతున్నాయి..గతంలో వేసిన మార్కింగ్‌ను మించి తొలగింపు చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేసినా ఏమాత్రం ఆగడం లేదు. యథావిధిగా పనులు సాగాయి.



చూసిన కనులదే భాగ్యమట : వేడుకగా స్వామి కల్యాణం

భక్తజనుల వాడా..

భక్తజనులవాడా.. వాడపల్లి వేంకటేశ్వరుడా అంటూ భక్తులు మొక్కారు.. కనులారా దర్శించుకుని.. మనసారా వేడుకున్నారు.. వాడపల్లి వేంకటేశ్వరుడి కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం ఉదయం రథోత్సవం సాగింది.. తిరువీధుల్లో ఊరేగిన స్వామిని కనులారా దర్శించుకుని ఏడుకొండలవాడా వెంకన్నా అంటూ కొలిచారు.. సాయంత్రం కల్యాణ క్రతువు వేడుకగా సాగింది. ప్రత్యేక అలంకరణలో స్వామి తమ చెంతకే రావడంతో కన్నులారా చూసిన భక్తజనం పులకించిపోయారు.. తన్మయత్వంతో ఊగిపోయారు. - వివరాలు 6లో

ఇక డిపాజిటర్లకు.. జయమే!



కాకినాడ జిల్లా సర్పవరం జంక్షన్‌లోని జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం

'జయ'ం జరిగేలా సర్కారు అడుగులు

- జయలక్ష్మి బాధితులకు అండ
- సీఎం దృష్టికి తీసుకువెళ్లిన కలెక్టర్
- సీఐడీతో ప్రభుత్వం సంప్రదింపులు
- రూ.450 కోట్ల ఆస్తుల వేలం
- 11న సీఎం చెంతకు పాలకవర్గం
- జూన్‌కల్లా కొంత చెల్లించే యత్నం
- గడువు విధించిన అధికారులు
- మూడేళ్ల కిందట ఘటన
- రూ.582 కోట్లకు శఠగోపం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఒకటి కాదు..రెండు కాదు..ఏకంగా రూ.582 కోట్ల కుంభకోణం..జరిగి మూడేళ్లయినా ఇప్పటికీ బాధితులకు న్యాయం దక్కలేదు.. గత వైసీపీ ప్రభుత్వం అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసేసి బాధితులకు తీరని అన్యాయం చేసింది.. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అండగా నిలబడేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించింది.. సీఐడీ సీజ్ చేసిన రూ.450 కోట్ల సొసైటీ ఆస్తులను ఎలాగైనా వేలం వేసి బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.ఈ మేరకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఇప్పటికే ఈ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో వేలం ప్రక్రియకు వేగంగా అడుగులు పడుతున్నాయి. తొలివిడత రూ.200 కోట్లయినా చేతికి అందితే బాధితులకు న్యాయం జరిగే అవకాశం ఉండడంతో ఆ దిశగా ప్రయత్నాలు ఊపందుకున్నాయి.అటు సొసైటీ పాలకవర్గం సైతం ఈ నెల 11న సీఎం చంద్రబాబును కలవడానికి సన్నాహాలు చేస్తోంది. బాధితులకు న్యాయం చేయాలని సీఎంను కోరనుంది.జూన్‌లోపు బాధితులకు 25 శాతమైనా నగదు చెల్లించాలని ప్రయత్నాలు చేస్తోంది.

ప్రభుత్వం మారడంతో చకచకా..

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇప్పుడు సొసైటీ బాధితులకు న్యాయం చేసేందుకు వేగం గా అడుగులు పడుతున్నాయి.ఇటీవల కలెక్టర్ల సదస్సులో ఈ అంశంపై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సీఎం చంద్రబాబుతో చర్చించారు. సీఐడీ అటాచ్‌లో ఉన్న రూ.450 కోట్ల స్థిరాస్తులను వేలం వేసేలా చర్యలు చేపడితే బాధితులకు న్యాయం జరుగుతుందని వివరించారు. తొలుత సీఐడీతో ప్రభుత్వం చర్చించి వేలం ప్రక్రియ ముందుకు సాగేలా ప్రస్తుతం చర్యలు చేపట్టింది. వేలానికి అన్నీ అనుకూలిస్తే నెల వ్యవధిలో ప్రక్రియ ముగించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.దీంతో బాధితుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. వైస్ చైర్మన్ విశాలాక్షి మేనల్లుడు ఆకెళ్ల ఉదయశంకర్ రూ.60 కోట్లతో లండన్ చెక్కేయడంతో సీఐడీ ఇప్పటికే లుక్ అవుట్ నోటీసు..తాజాగా రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేశారు.హైదరాబాద్‌లో నిందితుడికి చెందిన రూ.150 కోట్ల విలువైన 14 స్థిరాస్తులను సీఐడీ సీజ్ చేసింది. లోన్లు తీసుకున్న 235 మందిపై ట్రిబ్యునల్‌లో కేసు నమోదు చేయగా 40 మందిపై కోర్టులో నెంబర్ దాఖలైంది.

రూ.582 కుంభకోణానికి మూడేళ్లు

కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్ ప్రధాన కేంద్రంగా ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో ఎన్నో ఏళ్లుగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించేది. మూడేళ్ల కిందట ఈ సంస్థ డిపాజిటర్లను మోసం చేసింది. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, విశాఖ జిల్లాల్లో 29 బ్రాంచీల ద్వారా 20 వేల మంది నుంచి రూ.582 కోట్ల వరకు డిపాజిట్లు సేకరించి 2022 ఏప్రిల్ 6న బోర్డు తిప్పేసింది. బాధితుల ఆందోళనలతో ప్రభుత్వం విచారణకు ఆదేశించగా రూ.582 కోట్ల మేర ఆర్థిక మోసం జరిగినట్టు జిల్లా సహకారశాఖ, సీబీసీఐడీ అధికారులు 348 పేజీల నివేదికను 2023లో అప్పటి ప్రభుత్వానికి అందించారు. ఈ ఆర్థిక కుంభకోణానికి ప్రధాన సూత్రదారులుగా జయలక్ష్మి సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, వైస్‌చైర్మన్ రాయవరపు బదరీ విశాలాక్షి, ఇతర డైరెక్టర్లు రాయవరపు జయమణి, చక్రభాస్కరరావు, ప్రబల మల్లిఖార్జునరావు, మంగళంపల్లి వెంకట సుబ్రహ్మణ్యకుమార్, వారణాసి శాంతేశ్వరరావు, దూళ్ల శ్రీనివాస్, ఆర్.నాగేశ్వరరావు, జయశంకర్‌లుగా నిర్ధారించి నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. సీఐడీ విచారణ తర్వాత కుంభకోణంలో 159 మంది పాత్ర ఉన్నట్టు గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచింది. 98 ఆస్తులకు చెందిన రూ.450 కోట్ల విలువైన స్థిరాస్తులను సొసైటీ చొరవతో సీఐడీ సీజ్ చేసి కోర్టుకు అటాచ్ చేసింది. ఈ ఆస్తులపై సేల్ ఆర్డర్ కోసం ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో నడుస్తోంది. నూతన పాలకవర్గం చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు ఇది వరకే సొసైటీ నుంచి రుణాలు తీసుకున్న వారి నుంచి రూ.6 కోట్లు వసూలు చేసి బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఇంకో రూ.6 కోట్లు సీఐడీ సీజ్ చేసిన దాంట్లో కోర్టులో పెండింగ్‌లో ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నేతలు ఈ ఆస్తులపై కన్నేసి కొట్టేశారు.

త్వరలో మరిన్ని జీవోలు..

కుంభకోణానికి సంబంధించి 21,895 మంది డిపాజిట్‌దారులకు 2022 నాటికి వడ్డీతో కలిపి మొత్తం రూ.511 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్లు ఇప్పటికే లెక్కలు తేల్చారు. ప్రధానంగా రూ.లక్ష లోపు డిపాజిట్‌దారులు 13,249 మంది ఉండగా, రూ.32.72 కోట్లు చెల్లించాల్సి ఉంది. రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల మధ్య డిపాజిట్‌దారులు 2,384 మంది ఉండగా వీరికి రూ.37.83 కోట్లు, రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల్లోపు 810 మంది ఉండగా వీరికి రూ.27.99 కోట్లు, రూ.5 లక్షల లోపు 677 మంది బాధితులు ఉండగా వీరికి రూ.30.41 కోట్లు, రూ.5 లక్షలు ఆపైన బాధితులు 2,563 మంది ఉండగా వీరికి రూ.349 కోట్లు చెల్లించాల్సి ఉంది. రూ.582 కోట్ల కుంభకోణంలో వైస్ చైర్మన్ విశాలాక్షి ఒక్కరే ఎటువంటి పూచీకత్తు లేకుండా బినామీలతో రూ.300 కోట్లు కొట్టేయడం గమనార్హం. ఇప్పటి వరకు 98 ఆస్తులకు చెందిన రూ.450 కోట్ల స్థిరాస్తులను సీఐడీ సీజ్ చేయగా ఈ ఆస్తుల స్వాధీనానికి ప్రభుత్వం 12 జీవోలు జారీ చేసింది.మరో ఐదు జీవోలు విడుదల చేయాల్సి ఉండగా మరో వారంలో రూ.100 కోట్ల ఆస్తుల సీజ్ కోసం రెండు జీవోలు ప్రభుత్వం విడుదల చేసే అవకాశం ఉంది.

ప్రత్యేక ఆర్డినెన్స్ అవసరం

కూటమి ప్రభుత్వంలో జయలక్ష్మి సొసైటీ బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్న నమ్మకం కలిగింది. ఇటీవల కలెక్టర్ల సదస్సులో జయలక్ష్మి వ్యవహారంపై సీఎం చర్చించడం మంచి పరిణామం. ఇప్పటికే కలెక్టర్ ద్వారా సహకారశాఖ కమిషనర్, సీఐడీ ద్వారా సీఎంకు లెటర్లు పంపాం. సొసైటీ సమగ్ర నివేదిక, సీజ్ చేసిన ఆస్తులు, తదితర వివరాలన్నీ కలిపి సొసైటీ పాలకవర్గం సభ్యులతో ఈనెల 11న సీఎం చంద్రబాబును కలవబోతున్నాం. సొసైటీ బాధ్యతలు తీసుకున్న సమయంలో ఒక్క రూపాయికి కూడా లేని స్థితినుంచి రూ.500 కోట్లకుపైగా ఆస్తుల గుర్తింపు, స్వాధీనం చేసుకోవడంలో పోలీసు, సీఐడీకి సహకరించాం.బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువస్తే సేల్ ఆర్డర్స్ వేగంగా వచ్చే అవకాశం ఉంది.
- గంగిరెడ్డి త్రినాథరావు, చైర్మన్, జయలక్ష్మి సొసైటీ

పోలవరం.. పరుగు



- చకచకా సాగుతున్న పనులు
- ఇప్పటి వరకూ 55.9 శాతం
- ఒక పక్క డయాఫ్రం వాల్
- మరో పక్క ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్
- 2027 డిసెంబర్‌కి ప్రాజెక్టు
- రెండేళ్లలో పూర్తిచేయడం లక్ష్యం
- సీఎం చంద్రబాబు రాకతో వేగం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయి. డయాఫ్రంవాల్ నిర్మాణానికి సన్నాహ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏడాది జనవరి 18న డయాఫ్రం వాల్ పనులు ఆరంభించారు. మొత్తం 1396.6 మీటర్ల మేర ఈ వాల్‌ను నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకూ 158.2 మీటర్ల మేర నిర్మించారు.ఇంకా సుమారు 1238 మీటర్ల వాల్ నిర్మించాల్సి ఉంది.ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీకి దీనిని పూర్తి చేసి 2026 జనవరి1కి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి నిర్ణయించుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. డయా ఫ్రం వాల్ మీదనే అసలు డ్యామ్ అయిన ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ (ఈసీఆర్‌ఎఫ్) నిర్మించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో డయాఫ్రంవాల్ నిర్మాణం పూర్తయ్యే వరకూ వేచి ఉండకుండా దానికి సమాంతరంగా ఇరువైపులా ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ నిర్మాణ పనులు చేయడానికి నిర్ణయించారు. ఈసీఆర్‌ఎఫ్ గ్యాప్-1ను పూర్తి చేసే పనిలో అధికారులు, యంత్రాలు నిమగ్నమయ్యాయి. సీఎం నారా చంద్రబాబునాయుడు ఇటీవల స్వయంగా ప్రాజెక్టు పరిశీలించి అధికారులకు సూచనలు చేయడంతో పనులు వేగవంతం అయ్యాయి.2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని ప్రభుత్వం చెబుతోంది.

పనులు జరిగిన తీరిది..

ఇప్పటి వరకూ పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం పనులు 55.90 శాతం జరిగాయి.సివిల్ వర్కు 78.56 శాతం, హెడ్ వర్కు పనులు 76.43 శాతం,కుడి ప్రధాన కాలువ (ఆర్‌ఎంసి) పనులు 92.75 శాతం, ఎడమ ప్రధాన కాలువ(ఎల్‌ఎంసి) పనులు 74.43 శాతం, భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనులు 25.11 శాతం జరిగాయి.వైసీపీలో చతికిలపడిన ప్రాజెక్టును కొత్త ప్రభుత్వం గాడిలో పెట్టింది.2024 జూన్ నుంచి ఇప్పటి వరకూ సుమారు 7 శాతం పనులు జరిగాయి.

ఇదీ యాక్షన్ ప్లాన్

పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్‌కు సంబంధించి అధికారులు స్పష్టమైన ప్రణాళికతో ఉన్నారు. ఈసీఆర్‌ఎఫ్ గ్యాప్ -1 పనులు 2024 డిసెంబర్ 10న ప్రారంభించారు.2026 మార్చి 31కి పూర్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారు. డయాఫ్రంవాల్ పనులు ఈ ఏడాది జనవరి 18న ఆరంభించారు.ఈ ఏడాది డిసెంబర్ 31కి పూర్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఈసీఆర్ ఎఫ్ గ్యాప్-2 పనులు ఇంకా మొదలుకాలేదు. ఇవి త్వరలో మొదలు పెట్టి 2027 డిసెంబర్ 27కి పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నారు.ఇవి పూర్తయితే ప్రాజెక్టు పూర్తయినట్టే. కుడి వైపు అనుబంధ పనులు వచ్చే ఏడాది జూలై 31కి పూర్తి చేయడంతో పాటు ఎడమ వైపు అనుబంధ పనులు 2027 ఫిబ్రవరి 28కి పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నారు.ఇక భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, కాలనీల నిర్మాణం, కుటుంబాల తరలింపు పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. మరో పక్క పవర్ ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయి.స్పిల్‌వే పూర్తి కావడంతో ఇప్పటికే గోదావరి నీటిని స్పిల్‌వే గుండా ధవళేశ్వరం బ్యారేజీ వైపు వదిలేస్తున్న సంగతి తెలిసిందే.



టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంతి

పీజీఆర్‌ఎస్ అర్జీలు 92 శాతం పరిష్కారం

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పరంగా పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీల్లో 92 శాతం పరిష్కరించారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.అమరావతి నుంచి సీసీఎల్‌ఏ కమిషనర్ జి.జయలక్ష్మి మంగళవారం జిల్లా కలెక్టర్లతో పీజీఆర్‌ఎస్ అర్జీలు, వాటర్ టాక్స్, భూముల క్రమబద్ధీకరణ అంశాలపై నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు.జిల్లా వ్యాప్తంగా పీజీఆర్‌ఎస్‌లో 6765 అర్జీలకు 6226 పరిష్కరించినట్టు తెలిపారు. ఇంకా 529 అర్జీలు పరిష్కరించాల్సి ఉందన్నారు. భూముల క్రమబద్ధీకరణకు ఇప్పటి వరకు 278 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీఆర్‌వో 251, ఆర్‌ఐ 27 పరిశీలించారని తెలిపారు. 150 గజాల్లోపు 271 దరఖాస్తులు 151-300 గజాల్లోపు 6 దరఖాస్తులు 450 గజాలు పైబడి ఒక్క దరఖాస్తు వచ్చినట్టు తెలిపారు. నీటి తీరువా పన్నుల వసూళ్లకు సంబంధించి 272 రెవెన్యూ గ్రామ పంచాయతీలకు ఇప్పటి వరకు 254 పంచాయతీల పరిధిలో వసూళ్ల పూర్తి చేసినట్టు తెలిపారు.సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్‌వో టి.సీతారామమూర్తి,జిల్లా ల్యాండ్ సర్వే అధికారి బి.లక్ష్మినారాయణ, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్యాష్ కొట్టు.. భూమి సరిపెట్టు!

- నాడు రీసర్వే తప్పుల తడక
- నేడు రైతుల సతమతం
- సరిచేసుకునేందుకు అష్టకష్టాలు
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- డబ్బులిస్తేనే తొలి ప్రాధాన్యం
- జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి



గోకవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన రీ సర్వే రైతులకు అనేక కొత్త తలనొప్పులను తెచ్చిపెట్టింది. పొలాల హద్దులు రూపు మారి పోవడం, సర్వే నెంబర్లలో తేడాలు, ఒకరి భూమి మరొకరి పేరు మీదకు మారడం ఇలా పలు రకాల ఇబ్బందులను రైతులు చవి చూశారు. అప్పట్లో ఎదురైన భూ ఇబ్బందులను పరిష్కరించుకునేందుకు బాధిత రైతాంగం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఎటువంటి న్యాయం జరగలేదు. తరువాత కొంతకాలానికి ప్రభుత్వం అధికారం చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ సమస్యలను పరిష్కరించేందుకు రంగం సిద్ధం చేసింది. దీనిలో భాగంగా గత డిసెంబరు 6వ తేదీ నుంచి జనవరి 8 వరకు ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. బాధిత రైతుల నుంచి భూ పరమైన సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించింది. ఇంత వరకూ బాగానే ఉంది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కొంత మంది రెవెన్యూ సిబ్బంది నుంచి సరికొత్త కష్టాలు ఎదురవు తున్నాయి. భూ సమస్యల పరిష్కారం పేరుతో జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా సర్వేయర్లు, కొంతమంది గ్రామ స్థాయి రెవెన్యూ అధికారుల చేయి తడపనిదే సమస్య పరిష్కారం కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఎవరైనా గట్టిగా నిల దీస్తే పని ఒత్తిడి ఉందంటూ రైతులను తమ చుట్టూ తిప్పుకుంటున్నారు. ముడుపులు ఇచ్చిన దానిని బట్టి కూడా సర్వేయర్లు కొలతల్లో తేడాలు చూపిస్తున్నారు.ఉదాహరణకు గోకవరం మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధికారులకు సుమారు 212 అర్జీలు అందాయి.వాటిలో ప్రత్యేకంగా సుమారు 152 అర్జీలే సర్వే కోసం అధికారులకు అందాయంటే ఇక్కడి రైతులు భూపరమైన సమస్యలను ఎలా ఎదుర్కొంటున్నారో, వాటి పరిష్కారానికి సర్వేయర్లు ఎలా పని చేస్తున్నారో అర్థమవుతుంది. అర్జీదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నచ్చిన వారికి ఒకలా నచ్చని వారికి మరొకలా పని కానిచ్చేస్తున్నారు. ఒకవేళ అసహనంతో ఏ రైతైనా తిరగబడితే ఈవేళ అర్జెంట్ పని ఉందంటూ తమ పంతం తీర్చుకుంటున్నారనే బలమైన ఆరోపణలు లేకపోలేదు.ప్రభుత్వ రికార్డుల్లో ఏర్పడిన ఇబ్బందుల దృష్ట్యా రైతులను మాటలతో భయపెట్టి తరువాత జేబులు నిండాక బాధిత రైతులను సంతప్తి పరుస్తున్నారు. కొంతమంది అమాయక రైతుల బలహీనతలను రెవెన్యూ సిబ్బంది క్యాష్ చేసుకుంటున్నారు.

చివరికి.. మళ్లీ పరుగులే!



అకాలవాన : గౌరీపట్నం జాతీయరహదారిపై తడుస్తున్న ధాన్యానికి.. తడుస్తూ బరకాలు కప్పుతున్న రైతులు

దేవరపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అకాలవాన అన్నదాతను ఏడిపిస్తోంది.. నిండు వేసవిలో వరుణ దాడి తెలియక రైతాంగం లబోదిబోమంటున్నారు. వాతావరణ మార్పులతో ఉరుకులు..పరుగులు పెడుతున్నారు.దేవరపల్లి మండలంలోని గౌరీపట్నం, దుద్దుకూరు, త్యాజంపూడి, కృష్ణం పాలెం, రైతులు తాము అరుగాలం పండించిన పంటను జాతీయ రహదారులకు ఇరువైపులా ఆరబెట్టారు. ఉదయం నుంచి భానుడు మండిపడ్డాడు.. వాతావరణం బాగానే ఉందని ఎక్కడ వారు అక్కడ సర్దుకున్నారు. మంగళవారం సాయంత్రం అకాల వర్షం రావడంతో ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు పరుగులు తీశారు. ధాన్యం పోగేసి బరకాలు కప్పారు.అయినప్పటికి వర్షం వల్ల కింద నుంచి తేమచేరి రంగుమారడం, మొలకలు రావడం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పల్లంట్ల, కురుకూరు, లక్ష్మీపురం గ్రామాల్లో కళ్లేలపై ఆరబెట్టిన ఎండుమిర్చి వర్షానికి తడిచి ముద్దయ్యింది. దీని వల్ల రంగు మారి కాయలు గుల్లబారతాయని రైతులు వాపోతున్నారు. అకాల వర్షం కారణంగా మొక్కజొన్న, పొగాకు తోటలకు నష్టం వాటిల్లింది. ఈదురుగాలుల కారణంగా యర్నగూడెం ప్రధాన సెంటర్‌లో ఒక్కసారిగా కొబ్బరిచెట్టు పడింది. అల్పపీడన ప్రభావంతో భారీ ఈదురుగాలులు, భారీ వర్షంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది.

యథావిధిగా ఎన్టీఆర్ వైద్యసేవలు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలు మంగళవారం నుంచి యథావిధిగా కొనసాగుతున్నాయి. స్పెషాలిటీ ఆసుపత్రుల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు విజయవంతం కావడంతో వైద్యసేవలు తిరిగి ప్రారంభించారు. బకాయిలు చెల్లించకపోతే ఈ నెల 7వ తేదీ నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని స్పెషాలిటీ ఆసుపత్రుల యాజమాన్య సంఘం గతంలో చేసిన ప్రకటనకు అనుగుణంగా సోమవారం వైద్యసేవలను నిలిపివేశారు. దీనిపై సీఎం చంద్రబాబు తక్షణమే రూ.500 కోట్లు విడుదల చేయాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆసుపత్రుల సంఘం ప్రతినిధులు సమ్మె విరమించినట్టు జిల్లా కో ఆర్డినేటర్ ప్రియాంక తెలిపారు.

బాధ్యతల నిర్వహణలో నైతికత అవసరం

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బాధ్యతల నిర్వహణలో నైతికత అవసరమని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం ఆర్డీవోలు, తహశీల్దార్లు, మండల సర్వే అధికారులకు రెవెన్యూ సంబంధిత అర్జీలు,వాటి పరిష్కారాలపై దిశా నిర్దేశం చేశారు. అర్జీల పరిష్కార విధానంలో మూడు ప్రధాన అంశాలను గుర్తెరగాలన్నారు. ప్రతి వారం సీఎం అర్జీలపై సమీ క్షిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణకు అనుమతిపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

వచ్చేనెల 10న జాతీయ లోక్ అదాలత్



9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ

కొవ్వూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చని 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ తెలిపారు. మంగళవారం కోర్టు ప్రాంగణంలో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర , జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో మే 10వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందులో సివిల్, క్రిమినల్, కుటుంబ తగాదా, భార్యాభర్తల భరణం, డొమస్టిక్ వయెలెన్స్, మోటారు వాహనాల యాక్సిడెంట్లు, బ్యాంకు బకాయిలు, ప్రీలిటికేషన్, టెలిఫోన్ బకాయిలు, ప్రామిసరీ నోట్ కేసులు రాజీ చేసుకోవచ్చునన్నారు.

ఏఐపై డిగ్రీ కళాశాల అధ్యాపకులకు అవగాహన



అధ్యాపకులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ శ్రీనివాస చక్రవర్తి

కొవ్వూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనేది కంప్యూటర్ యంత్రాల ద్వారా మానవ మేథస్సును అనుకరించే సామర్థ్యమని విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ నెక్కంటి శ్రీనివాస చక్రవర్తి అన్నారు. మంగళవారం ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు రెండు రోజుల వర్క్‌షాప్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రామ్మోహన్ ప్రారంభించి మాట్లాడుతూ కళాశాల ఛైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ (ఏఐ) ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సరికొత్త టెక్నాలజీపై కళాశాలలోని అధ్యాపకులందరూ అవగాహన కలిగి ఉండాలని ఉద్దేశంతో వర్క్‌షాప్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కళాశాల అడ్వయిజర్ ఎస్‌వీ సుబ్బారావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు



పాతపేట రామాలయం వద్ద అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొవ్వూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8వ వార్డు పాతపేటలో వేంచేసియున్న రామాలయంలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉత్సవాలు ముగింపు సందర్భంగా సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుమారు 1000 మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంద్రోతు కోదండరామారావు, గంద్రోతు చిట్టిబాబు, వంగా రాజేష్, జి. స్వా మి, జి. రాయుడు, దుగ్గిన చైతన్య (పండు), ఉన్నమట్ల సాయి, అత్తిలి పవన్, కాండ్రపు శ్రీను, పాతపేట యూత్ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

మాతృశ్రీ అనసూయాదేవి జయంతి



అనసూయాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ జిల్లేలమూడి అనసూయాదేవి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గుడివాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక థియేటర్ రోడ్డులోని మాతృశ్రీ అనసూయాదేవి ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబికా అష్టోతరం, లలితా సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం ప్రజలకు స్వీట్స్, పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడివాక రామకృష్ణకుమార్, చనమల సుబ్బారావు, సలాది సందీప్‌కుమార్, లింగాల శివ సుబ్రహ్మణ్యశర్మ, శివరామ గ్యాస్ ఏజన్సీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



చాగల్లులో రైతులకు పవర్ టిల్లర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

చాగల్లు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రైతు రథం పథకంలో మంజూరైన ఐదు పవర్ టిల్లర్లను రైతులకు పంపిణీ చేశారు. వీటి ధర ఒక్కొక్కటి రూ. 2,29,500 కాగా, ప్రభుత్వం రూ. లక్ష సబ్సిడీగా అందజేస్తుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని సకా లంలో కొనుగోలు చేయడంతో పాటు వారికి చెల్లించాల్సిన డబ్బు లను కూడా తక్షణమే చెల్లిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఆళ్ల హరిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, టీడీపీ నాయకులు బొడ్డు రాజు, బొల్లిన శివ నాగేంద్ర, గారపాటి బాబూ రావు, పత్తిపాటి వెంకట సుబ్బా రావు, తాళ్లూరి ప్రసాద్, తాళ్లూరి శ్రీనివాస రావు, జనసేన నాయకుడు ఉప్పులూరి చిరంజీవి, తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఎంపీడీవో ఆర్. శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మలకపల్లిలో ...

తాళ్లపూడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రైతే దేశానికి వెన్నెముక అని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మలకపల్లిలోని రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ రైతు పండించిన పంటకు ఎప్పటికప్పుడు గిట్టుబాటు ధర కల్పించి, ధాన్యం కొన్న గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రైతును పూర్తిగా నిర్లక్ష్యం చేసిం దన్నారు. కార్యక్రమంలో వ్యవసా యశాఖ ఏడీ చంద్రశేఖర్, ఇన్‌చార్జి తహశీల్దార్ మోహన భారతి, ఏవో రుచిత, సర్పంచ్ రాపాక రాజేశ్వరి, ఉప సర్పంచ్ రామారావు, నామన పరమేశ్వ రరావు, మద్దిపాటి ప్రకాశం, కోడి శంకరం, చెరుకూరి వెంకట్రావు, గంటా కృష్ణ, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ఇతరులు

చీపురుగూడెంలో ఏకాహం

నల్లజర్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెం రామాలయం వద్ద మంగళవారం ఏకాహం నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి బుధవారం ఉదయం ఆరు వరకు జరుగుతుందని నిర్వాహకుడు కూసంపూడి వెంకటేశ్వరరావు తెలిపారు. చెల్లు పెద్ద రామన్న, చెల్లు సుబ్రహ్మణ్యం, దానరావు, ప్రత్తిపాటి రాంబాబు, చెల్లు వీర వెంకట్రావు, వెంకటరత్నం, తదితరులున్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలు



ప్రక్కిలంకలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ హారికాగుప్త, ఐసీడీఎస్ అధికారులు

తాళ్లపూడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంక అంగన్‌వాడీ కేంద్రం వద్ద మంగళవారం ఐసీడీఎస్ పరిధిలో నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలలో 8వ తారీఖు నుంచి 22 వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు (పోషన్ పక్వాడా) నిర్వహిస్తున్నట్టు సెక్టార్ సూపర్‌వైజర్లు భాగ్యకుమారి, భవానీ తెలిపారు. దీనిలో భాగంగా రెండు సెక్టార్లలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం అందిం చే పౌష్టికాహారం గురించి వివరిస్తూనే ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిపించారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

తాళ్లపూడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఆ కళాశాల ప్రిన్సిపాల్ గరగ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలు రాసి ఇంటర్‌లో చేరే విద్యార్థులు ఫలితాలతో సంబంధం లేకుండా ఇంటర్‌లో చేరే అవకాశం కలిపిస్తున్నట్టు చెప్పారు. కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులతో పాటు ఈ సంవత్సరం ఎంబైపీసీను కూడా ప్రారంభిస్తున్నామన్నారు. విద్యార్థులు సైన్స్ గ్రూపునకు రూ. 2409, ఆర్ట్స్ గ్రూపునకు రూ.14719 చొప్పున ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. అలాంటి వారికి టెక్స్ బుక్స్, స్టడీ మెటీరియల్, నోటు బుక్స్, ల్యాబ్ రికార్డులు, బ్యాగ్‌ను అందిస్తామన్నారు. అలాగే ప్రతి విద్యార్థికి డొక్కా సీతమ్మ ఆహార పథకం ద్వారా మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తామన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కొవ్వూరు, ఏప్రిల్ 8 : వేములూరు గ్రామ శివారులో మంగళవారం పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పట్టణ సీఐ పి.విశ్వం తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఇందులో ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 1520 నగదు, రెండు ప్లేయింగ్ కార్డులు స్వాధీనపర్చుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

ఇద్దరు మందుబాబులకు జరిమానా

నిడదవోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపినట్టు గుర్తించి కేసులు నమోదు చేశామని ఎస్ఐ పరమహంస తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిడదవోలు స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ జడ్జి నక్కా అజయ్ కుమార్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

పెన్షన్ సవరణ బిల్లును.. ఉపసంహరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు ఐవీ సత్యం, తదితరులు

నల్లజర్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన పెన్షన్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు ఐవీ సత్యం అన్నారు. మంగళవారం నల్లజర్ల సహకార సంఘం సమావేశ మందిరంలో మండల స్థాయి విశ్రాంత ఉద్యోగుల సమావేశం జరిగింది. సత్యం మాట్లాడుతూ పెన్షన్ సవరణ బిల్లు అమలయితే పెన్షన్ పెరుగుదల ఉండదని, కేవలం కరువు భత్యం మాత్రమే పెరుగుతుందన్నారు. పేరివిజన్ కమిషన్ సిఫార్సులు పాత వారికి వర్తించదని, కేవలం ఆ కమిటీ కాలంలో పదవీ విరమణ చేసిన వారికి మాత్రమే లబ్ధి కలుగుతుందన్నారు. ఎస్ఎం ఆలీసాహెబ్, బాలయ్య, కామేశ్వరావు, ప్రభుదాసు, శ్రీరామ్మూర్తి, ఏసురత్నం, ప్రతాప్ పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి కల్యాణం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కేశవచారి ఆధ్వర్యంలో జరిగింది. భక్తులు పాల్గొని తిలకించారు.

పిడుగుపడి వ్యక్తి మృతి

నల్లజర్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మగూడెంకి చెందిన వెలగాని సత్యనారాయణ (46) మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో ప్రాథమిక పాఠశాల సమీపంలో ఉన్న మామిడి చెట్టు కిందకు చేరుకున్నాడు. దీంతో ఒక్కసారిగా ఆయనకు సమీపంలో పిడుగు పడడంతో ఒక్కసారిగా కిందపడి మృతి చెందాడు. ఈయన హైదరాబాద్‌లో వాచ్‌మెన్‌గా పని చేసి, ఇటీవల కుటుంబసభ్యులతో పాటు వచ్చేసి కృష్ణమ్మగూడెంలో నివసిస్తున్నాడు. నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తల్లిని చూసేందుకు వెళ్తుతుండగా...

● ఇసుక లారీ ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన గోవిందు

ఆత్రేయపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తల్లిని చూసేందుకు వెళ్తున్న వ్యక్తిని ఇసుక లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామానికి చెందిన కడలి గోవిందు (44)వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నాడు. మంగళవారం తన తల్లిని చూడడానికి మట్లదొడ్డి గ్రామానికి వెళ్తుండగా డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం మెర్లపాలెం మావుళ్లగుడి సమీపంలో రావులపాలెం నుంచి ఆత్రేయపురం వస్తున్న ఇసుక లారీ ఎదురుగా మోటార్‌సైకిల్‌పై వస్తున్న గోవిందును బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ ఉల్లంఘనే

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించుకోవడం భారత రాజ్యాంగ ఉల్లంఘనేనని జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ ఛైర్మన్ ఎండి ఆరీఫ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు.

డిప్యూటీ సీఎం కుమారుడు కోలుకోవాలని ప్రత్యేక పూజలు



కడియాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న జనసేన నాయకులు

దేవరపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ మంగళవారం సింగపూర్‌లో తాను చదువుతున్న స్కూల్‌లో అగ్నిప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం ఆ చిన్నారి ఆరోగ్యం కుదుట పడాలని, తొందరగా కోలుకోవాలని గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి సువర్ణరాజు, ఇతర నాయకులు కడియాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పసుపులేటి శివనాగప్రసాద్, మాధవరపు వెంకటేశ్వరరావు, జాజిమొగ్గల శ్రీనివాస్, కొడమంచిలి శ్రీను, దుగ్గిన లీలాగంగాధర్ నాయుడు, సిద్ధాతాతాబ్బాయి, గంటా సురేశ్, కను మూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలి



కురుకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు

దేవరపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని, దళారులను ఆశ్రయించవద్దని టీడీపీ మాజీ అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు అన్నారు. యర్నగూడెం, కురు కూరు రైతుసేవా కేంద్రాల్లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిం చారు. కురుకూరులో కొయ్యలమూడి చినబా బు, యర్నగూడెంలో పెనుమత్స సుబ్బరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాల్లో యర్నగూడెం సొసైటీ కార్యదర్శి మండా పెదబాబు, కురుకూరు సొసైటీ కార్యదర్శి కొయ్యలమూడి గౌతం, టీడీపీ నాయకులు కొయ్యలమూడి అచ్యుతరాయుడు, గ్రామ సర్పంచ్ కొయ్యలమూడి అనంతలక్ష్మి, నాయకులు యలమాటి భాస్కర్, మల్లెల వెంకటేశ్వరరావు, యర్నగూడెం టీడీపీ నాయకులు బొల్లిన భాస్కర్, గద్దే శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిని.. అనుమానాస్పద మృతి

● మృతురాలి బంధువులను పరామర్శించిన మంత్రి దుర్గేష్



నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతురాలి బంధువులను పరామర్శిస్తున్న మంత్రి దుర్గేష్



కరుణ మృతదేహం

నిడదవోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగిని అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. నిడదవోలు మండలం కోరుమామిడికి చెందిన నెల్లి కరుణ నిడదవోలు 9వ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. రోజువారీ లాగే సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వచ్చి చర్చికి వెళ్లినట్టు తల్లి నెల్లి సూర్యకుమారి తెలిపారు. అక్కడ నుంచి వచ్చిన తరువాత కడుపునొప్పి వచ్చి అస్వస్థతకు గురైందని పేర్కొన్నారు. దీంతోట నిడదవోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో అక్కడ నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళుతుండగా మృతి చెందినట్టు ధ్రువీకరించారన్నారు. దీనిపై సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఎస్ఐ వీరబాబు మృతదేహాన్ని పరిశీలించి అను మానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మంత్రి దుర్గేష్ మృతురాలి కుటుం బీకులను పరామర్శించారు. కరుణ మృతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయా లని అధికారులను ఆదేశించారు.

బీజేపీలో గ్రూపులు, పైరవీలకు చోటులేదు

- అలాంటి వారిని అధిష్టానం ఉపేక్షించదు
- ఎమ్మెల్సీ సోము వీర్రాజు
-అభినందన సభలో కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ



రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో గ్రూపులు, పైరవీలకు చోటు ఉండదని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. అలాంటి వారిని పార్టీ అధిష్టానం ఉపేక్షించదనే విషయాన్ని నాయకులు, కార్యకర్తలు గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో బీజేపీ ఎమ్మెల్సీగా రెండో సారి ఎన్నికైన సోము వీర్రాజుకు అభినందన సత్కారసభ నిర్వహించారు. ఈ సభకు శ్రీనివాసవర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సోము వీర్రాజు లేకపోతే తాను లేనన్నారు. కమ్యూనిస్టు పార్టీకి చెందిన ఏఐఎస్ఎఫ్‌లో ఉన్న తనను బీజేపీలోకి తీసుకొచ్చింది వీర్రాజేనని, పార్టీలో 30 ఏళ్లుగా కష్టపడి పనిచేయబట్టే ఈ రోజు కేంద్ర మంత్రి పదవి దక్కిందన్నారు. పార్టీ కోసం మనం పడిన కష్టమే గుర్తింపు, పదవులు తెచ్చిపెడుతుందని, సోము వీర్రాజుకు రెండవసారి ఎమ్మెల్సీ పదవి దక్కడం అందుకు ఉదాహరణ అన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వీర్రాజు 40 ఏళ్ల కిత్రం ఏ పార్టీలో చేరారో అదే రాజకీయపార్టీలో కొనసాగడం ఆయన అంకితభావాన్ని తెలియజేస్తుందన్నారు. శ్రీనివాస వర్మ, దుర్గేష్ ఈ సందర్భంగా వీర్రాజుకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

● తమిళనాడు, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం వస్తుంది : సోము

తమిళనాడులో త్వరలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని, తర్వాత తెలంగాణాలోనూ తమ ప్రభుత్వం ఏర్పడుతుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు జోస్యం పలికారు. ఎప్పుడు ఏం చేయాలో బీజేపీకి ఒక వ్యూహం ఉంటుందన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నపుడు ప్రతి నెలా వేల కోట్లు అప్పులు ఇప్పించే వాళ్లం. అంతే చేశాం. పోలవరానికి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నిధులు, రైల్వేజోన్ వంటివి ఇవ్వలేదన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు సీఎం అయ్యాక డబుల్ ఇంజన్ సర్కార్ రావడంతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. రాష్ట్రంలోని రొయ్యల రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ కృషి చేస్తారన్నారు. జిల్లా మాజీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు పర్యవేక్షణలో జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ అభినందన సభలో బీజేపీ ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఈశ్వరరావు, బీవీఎస్ మాధవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, వేటుకూరి సూర్యనారాయణరాజు, పాకా సత్యనారాయణ, కంబాల శ్రీనివాసరావు, భద్రం మాట్లాడారు. రాష్ట్ర నాయకులు నిర్మల, ముళ్లపూడి రేణుక, రేలంగి శ్రీదేవి, అయి నంపూడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. కాపు సంఘం నాయకులు, జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు.. సోము వీర్రాజును ఘనంగా సత్కరించారు. అంతకుముందు కోటిపల్లి బస్టాండు సెంటర్ నుంచి సభా వేదిక వరకూ నిర్వహించిన భారీ ర్యాలీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంజాబ్ రోడ్డు ప్రమాదంలో వాడపల్లి యువకుడి మృతి



మృతుడు లంకదాసు నాగ వెంకట యశ్వంత్ (ఫైల్)

కొవ్వూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ లవ్‌లీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్న వాడపల్లి యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వాడపల్లికి చెందిన లంకదాసు సముద్రం పెద్ద కుమారుడు లంకదాసు నాగ వెంకట యశ్వంత్ (23) పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లోని లవ్‌లీ యూనివర్శిటీలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఈ నెల 6వ తేదీన అమృత్‌సర్‌లో పరీక్ష రాయడానికి తన స్నేహితుడితో కలిసి మోటారు సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా కుపర్తల సమీపంలో హైవేపై డివైడర్‌ను వీరి వాహనం ఢీకొట్టడంతో యశ్వంత్‌తో పాటు స్నేహితుడు విజయనగరానికి చెందిన గానా సిద్ధిక్‌వర్మ (23) మృతిచెందాడు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం అమృత్‌సర్ నుంచి ఢిల్లీ తీసుకెళ్లి, ప్రత్యేక విమానంలో గన్నవరం తీసుకువచ్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో మంగళవారం మధ్యాహ్నం యశ్వంత్ మృతదేహాన్ని వాడపల్లి తీసుకువచ్చారు.

అనంతరం అంత్యక్రియలు పూర్తిచేశారు. యశ్వంత్ ఇటీవల కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలెక్ట్ కావడంతో మద్రాసులో ఉద్యోగం వచ్చిందని, చేతికి అందివచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మరణించడంపై కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు, టీడీపీ నాయకులు బీవీ రాఘవులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి, కుటుంబసభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు.